నేటి కందం-నేటికి అందం

ఇండో జపాను మధ్యన
నిండగు సంబంధములను నిలిపెడి కరణిన్
ఇండో జపాను చర్చలు
దండిగ జరిగినవి మిగుల దార్శనికతతోన్ !!

(ఇండో జపాన్ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా చర్చలు పారదర్శకంగా జరిగాయి. దీని వలన రెండు దేశాల మధ్య వాణిజ్యం మరియు అభివృద్ధి బాగా జరుగుతుంది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

పరస్పరం సవాళ్లు
పవర్ పార్టీ ప్రతిపక్షం
అప్పులు అవినీతిలో
అందరిదీ ఒకే పక్షం.
నిన్న నేడు ప్రభుత్వాల్లో
నిజాయితీ ఎవరికుంది
నిగ్గుతేల్చకుండ మాట
నిలకడింకా జారుకుంది



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 4-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:257 పేజీలు:6 వెల: రూ.1/-


## అప్పులతో తెలంగాణను సర్వనాశనం చేశారు..

### -బీఆర్ఎస్‌పై భట్టి విక్రమార్క ఫైర్



హైదరాబాద్, జులై 3:మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పాలనలో అప్పులపై కేసీఆర్ స్పందించాలన్నారు. ఈరోజు(శుక్రవారం) భట్టి మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో మొత్తం అప్పు రూ.8.21 లక్షల కోట్లు అని.. మొత్తం అప్పుల్లో గత ప్రభుత్వ బకాయిలు ఉన్నాయని తెలిపారు. అప్పులు అన్నీ వాస్తవాలు కాదా.. వీటిని ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

అప్పులను తక్కువ చేసి చూపేందుకే కేటీఆర్, హరీశ్ ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి మండిపడ్డారు. మంత్రిగా పనిచేశానని మర్చిపోయి మరీ హరీశ్ మాట్లాడుతున్నారని.. అనేక అంశాలపై అబద్ధాలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తేవాలన్నారు. బీఆర్ఎస్ నేతల అబద్ధాలు ప్రజల్లోకి వెళ్లకూడదన్నారు. సోషల్ మీడియా ద్వారా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాల పునాదులపై పదేళ్లు పరిపాలించారని.. బీఆర్ఎస్ చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విరుచుకుపడ్డారు. అప్పుల భారం రాష్ట్రంపై వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పాకిస్థాన్‌లో లోయలో పడిన బస్సు.. 40 మంది ప్రయాణికుల మృతి

ఇస్లామాబాద్, జులై 02: పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు.. లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 40 మంది ప్రయాణికులు మరణించారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్థాన్ బలూచిస్థాన్ రాష్ట్రంలో షెరానీ జిల్లాలో ఈ రోజు (శుక్రవారం) తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న షెరానీ జిల్లా ఉన్నతాధికారులు, వైద్యులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స కోసం ఝోబ్‌లోని ట్రామా సెంటర్‌కు తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల జరిగిన అత్యంత ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఇదీ కూడా ఒకటని అధికారులు తెలిపారు. సాంకేతిక లోపంతో ఓ బస్సు ఆగిపోయిందని, దీంతో అందులోని ప్రయాణికులను కూడా ఈ బస్సులోకి ఎక్కించారని అధికారులు చెప్పారు. దీంతో బస్సు ప్రయాణికులతో నిండిపోయిందన్నారు. ఈ ప్రమాదం జరిగిన బస్సు.. 36 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి బయలుదేరిందని పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభమైందని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

## ఆధారాలు ఉంటే బయటపెట్టాలి

### -గురుకుల టెండర్లపై మాట్లాడిన పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జులై 3:గురుకుల విద్యాసంస్థల టెండర్ల వ్యవహారం, గన్‌పార్క్ వద్ద జరిగిన రాజకీయ పరిణామాలపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించిన ఆయన, ప్రభుత్వంపై ఆధారాలు లేని విమర్శలు చేయడం సరికాదన్నారు. టెండర్ల విషయంలో వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

మీడియాతో మాట్లాడుతూ.. గన్‌పార్క్ వద్ద జరిగిన పరిణామాలపై వివరణ ఇచ్చిన మంత్రి, గోషామహల్, మలక్‌పేట ప్రాంతాల్లో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉండటంతో అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. హరీశ్‌రావు ఫోన్ ఎత్తలేదని ఆరోపిస్తున్నారని, అయితే మీడియాకు చెందిన జర్నలిస్టు రాహుల్ ఫోన్ చేస్తే ఆయన స్పందించలేదా అని ప్రశ్నించారు. రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం తమకు ఉందని, పోలీసులతో ప్రత్యర్థులను అరెస్ట చేయించేంత పిరికివాళ్లు కాదని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ నేతల విమర్శలకు కౌంటర్ ఇస్తూ.. అధికారంలో ఉన్నప్పుడు కూడా ప్రజా ప్రయోజనాల కోసం ప్రతిపక్షాన్ని విమర్శించామని, ఇప్పుడు కూడా అదే చేస్తున్నామని పేర్కొన్నారు. తాను, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఇద్దరూ కింది స్థాయి నుంచి ఎదిగిన నాయకులమని, తమ రాజకీయ ప్రయాణం అందరికీ తెలుసని అన్నారు. కొందరు వ్యక్తులు చెప్పిన సమాచారాన్ని మాత్రమే నమ్మి ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని హితవు పలికారు.



గురుకులాల టెండర్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణలను ఖండించిన మంత్రి, మొత్తం టెండర్ల విలువ రూ.1,142 కోట్లు మాత్రమేనని తెలిపారు. అలాంటప్పుడు రూ.2 వేల కోట్ల స్కాం జరిగిందని ఎలా చెబుతారని ప్రశ్నించారు. ప్రతి అంశానికి సంబంధించిన పత్రాలు, రికార్డులు ప్రభుత్వ వద్ద ఉన్నాయని, అవసరమైతే వాటిని ప్రజల ముందుంచేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

గురుకుల విద్యాసంస్థల్లో పారదర్శకత, నాణ్యత పెంపు, పరిపాలన సులభతరం చేయడం, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా వ్యవస్థను కేంద్రీకరించామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ చర్యలను రాజకీయ కోణంలో కాకుండా ప్రజా ప్రయోజనాల దృష్టితో చూడాలని ఆయన సూచించారు.

## స్కూల్ బస్సులో మంటలు, విద్యార్థులు సురక్షితం




అమరావతి, జులై 3: మండలంలో సంతగుడిపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం స్కూల్ బస్సులో ప్రమాదం తప్పింది. నరసరావుపేటకు చెందిన కే-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ బస్సు కర్లకుంట గ్రామానికి విద్యార్థులను తీసుకురావడానికి వెళ్లి తిరిగి వస్తుండగా బస్సులోని ఇంజిన్ భాగం నుంచి అకస్మాత్తుగా దట్టమైన పొగతో పాటు మంటలు చెలరేగాయి.

అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సును ఆపి, అందులో ఉన్న విద్యార్థులను సురక్షితంగా కిందికి దించాడు. అనంతరం స్థానికుల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు

## నూతన సీఎస్‌ను కలిసిన టీజీవోస్ నేతలు..

### -పీఆర్సీ, హెల్త్ కార్డులు, డీపీసీల ఏర్పాటు, పెండింగ్ ప్రమోషన్లపై ప్రభుత్వానికి విజ్ఞప్తి
### -ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని టీజీవోస్ ప్రతినిధుల బృందం వినతి
### -సీఎం కార్యదర్శులు, ఓఎస్డీతోనూ భేటీ.. సానుకూల స్పందన లభించిందన్న టీజీవోస్



హైదరాబాద్, జులై 3: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా (సీఎస్) బాధ్యతలు చేపట్టిన సంజయ్ జాజు, ఐఏఎస్‌ను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం (టీజీవోస్) రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బి. శ్యామ్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పలు కీలక సమస్యలను సీఎస్ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ సందర్భంగా టీజీవోస్ నాయకులు ఉద్యోగుల వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) అమలు, హెల్త్ కార్డు సేవలను సమర్థవంతంగా అందుబాటులోకి తీసుకురావడం, పెండింగ్‌లో ఉన్న డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీలు (డీపీసీలు) అత్యవసరంగా నిర్వహించి అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం వంటి అంశాలను ప్రస్తావించారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పెండింగ్ సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

అనంతరం ముఖ్యమంత్రి కార్యదర్శులు శేషాద్రి, శ్రీధర్‌తో పాటు ఓఎస్డీ వేముల శ్రీనివాస్‌ను కూడా టీజీవోస్ ప్రతినిధులు కలిశారు. ఉద్యోగుల సమస్యలపై వారు సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వ స్థాయిలో వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు టీజీవోస్ నాయకులు తెలిపారు.

## టోల్ బూత్‌ను ఢీకొట్టి పేలిన ఎల్పీజీ ట్యాంకర్.. భారీగా మంటలు, ఐదుగురు మృతి



లక్నో, జులై 3: ఒక ఎల్పీజీ ట్యాంకర్ టోల్ బూత్‌ను ఢీకొట్టింది. దీంతో ట్యాంకర్‌లోని గ్యాస్ లీకైంది. ఆ వెంటనే భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు మరణించారు. పలువురు గాయపడ్డారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జూన్ 26న ఉదయం 6:40 గంటల సమయంలో సిరోహి టోల్ ప్లాజా వైపు రెండు ఎల్పీజీ ట్యాంకర్లు వచ్చాయి. వాటిలో ఒకటి అదుపుతప్పింది. డివైడర్‌ను ఢీకొట్టి టోల్ బూత్‌లోకి దూసుకెళ్లింది.

కాగా, కాన్పూర్ నుంచి ప్రతాప్‌గఢ్‌కు వెళ్తున్న ఈ ఎల్పీజీ ట్యాంకర్ నుంచి భారీగా గ్యాస్ లీక్ అయ్యింది. అనంతరం కొన్ని నిమిషాల్లోనే భారీ పేలుడు సంభవించింది. సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకు ఈ మంటలు కనిపించాయి. ఇది చూసి స్థానికులు భయాందోళన చెందారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే జిల్లాలోని అన్ని అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పలు గంటలు శ్రమించి మంటలను అదుపుచేశారు.

మరోవైపు ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ 40 ఏళ్ల ధర్మేంద్ర దూబే, టోల్ ప్లాజా ఉద్యోగి అలోక్ సింగ్ అక్కడికక్కడే మరణించారు. టోల్ ప్లాజాకు చెందిన మరి కొందరు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన అనిల్ కుమార్ చికిత్స పొందుతూ జూలై 1న మరణించాడు. సహోద్యోగులైన ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీకి చెందిన హీరామణి సింగ్, మధ్యప్రదేశ్‌కు చెందిన కృష్ణ పాల్ మౌర్య మరునాడు చనిపోయారు.

అయితే ఆ టోల్ ప్లాజా సమీపంలో పార్క్ చేసిన 16 బైకులు, రెండు కార్లు కూడా మంటల్లో పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదం తర్వాత ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు కొంతసేపు వాహనాలను టోల్ ప్లాజా గుండా ఉచితంగా వెళ్లేందుకు అనుమతించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు కోసం ఒక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన గ్యాస్ ట్యాంకర్ పేలుడు వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## విషాదం.. రైలు కిందపడి దంపతుల మృతి

మేడ్చల్, జులై 3: జిల్లాలోని ఘట్కేసర్ సమీపంలో రైలు కిందపడి దంపతులు మృతిచెందిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. నిన్న(గురువారం) రాత్రి ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. మృతులు వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామానికి చెందిన రవికుమార్, శిరీషగా గుర్తించారు. ఘట్కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఘట్కేసర్- బీబీనగర్ రైల్వే మార్గంలో రైలు కింద పడి దంపతులు మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరి మృతికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దంపతుల మృతి సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. రవికుమార్, శిరీష మృతితో పాపయ్యపేట గ్రామం లో విషాద ఛాయలు అలముకున్నాయి.

## భక్తి, శ్రద్ధల మధ్య అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం.. మంచు లింగానికి తొలి హారతి



న్యూ ఢిల్లీ, జులై 3: హిందూ భక్తులు ఎదురుచూసిన అమర్‌నాథ్ యాత్ర శుక్రవారం ప్రారంభమైంది. 'భం భం భోలే', 'హర హర మహాదేవ్' అంటూ భక్తి నినాదాల మధ్య, భారీ భద్రత మధ్య ఘనంగా యాత్ర ప్రారంభమైంది. అమర్‌నాథ్ గుహలోని మంచు లింగానికి తొలి హారతి నిర్వహించారు. ఈ గుహకు జమ్మూ నుంచి మొదటి భక్తుల బృందాన్ని జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా జెండా ఊపి ప్రారంభించారు. జులై 3న ప్రారంభమైన ఈ యాత్ర 57 రోజులపాటు సాగుతుంది. రక్షాబంధన్ రోజైన ఆగస్టు 28న యాత్ర పూర్తవుతుంది.

భక్తుల భద్రత దృష్ట్యా, ఉగ్రదాడుల ముప్పు నేపథ్యంలో అధికారులు అమర్‌నాథ్ యాత్ర కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. యాత్ర సాగే మార్గంలో భారీగా భద్రతా దళాలు మోహరించాయి. సీఆర్పీఎఫ్, జమ్మూ కాశ్మీర్ పోలీస్, ఇండియన్ ఆర్మీతోపాటు వివిధ బలగాలు ఇక్కడ భద్రత కల్పిస్తు?న్నాయి. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతరం భద్రతను పర్యవేక్షిస్తున్నారు. భక్తులు అమితమైన ఉత్సాహం, భక్తి పారవశ్యాల మధ్య మంచు లింగాన్ని దర్శించుకునేందుకు ముందుకు సాగుతున్నారు. హిందూ విశ్వాసాల ప్రకారం ఆషాఢం, శ్రావణం (జూలై, ఆగస్టు) నెలల్లో అత్యంత భక్తి శ్రద్ధల మధ్య ఈ యాత్ర నిర్వహిస్తారు. ఈ రెండు నెలల కాలంలో వేలాది మంది భక్తులు మంచు లింగాన్ని దర్శించుకుంటారు. యాత్ర ప్రారంభమైన సందర్భంగా ప్రధాని మోదీ భక్తులకు లేఖ రాశారు.ఉనీలవతీనివవనిబి ఒణవనిఇఁతివబ

ఇది దేశంలోని అత్యంత పవిత్రమైన యాత్రలలో ఒక్కటి అన్నారు. ఈ యాత్ర భక్తి, ఏకత్వం, శ్రద్ధకు ప్రతీకగా మోదీ పేర్కొన్నారు. ఈ యాత్ర చేసే భక్తులు ఐదు సంకల్పాల్ని పాటించాలన్నారు. అవి. యాత్ర పరిసర మార్గాల్లో పరిశుభ్రతను కాపాడటం, ట్రాఫిక్ రూల్స్, సెక్యూరిటీ రూల్స్ పాటించడం, దేశీయ ఉత్పత్తులనే వాడటం, యాత్ర తర్వాత తల్లి పేరుతో ఒక మొక్క నాటడం, దేశానికే మొదటి ప్రాధాన్యం అనే అంశాన్ని పాటించడం అంటూ మోదీ పేర్కొన్నారు.

## ట్రిపుల్ తలాక్ కేసులో అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు

న్యూ ఢిల్లీ, జులై 3:హలాలా, ట్రిపుల్ తలాక్ కేసులో అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వ్యక్తిగత చట్టాలు, మతపరమైన ఆచారాల ముసుగులో క్రిమినల్ నేరాలను సమర్థించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. తీవ్ర శిక్షార్హమైన నేరారోపణలు ఉన్న కేసులను కేవలం పర్సనల్ లా పేరిట ఎఫ్ఐఆర్‌ను రద్దుచేయాలని కోరడం సమంజసం కాదని జస్టిస్ జె.జె.మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

ఈ మేరకు హలాలా పేరుతో ఓ మహిళపై లైంగిక దోపిడీ, సామూహిక అత్యాచారం సంబంధిత ఆరోపణల కేసులో 9 మంది నిందితులపై నమోదైన కేసును కొట్టివేయాలనే పిటిషన్ను కోర్టు తిరస్కరించింది. ఈ వ్యాజ్యం విచారణ సందర్భంగా.. ఈ ఆరోపణలు సమాజంలోని ఓ వర్గం ఇప్పటికీ రాజ్యాంగం కల్పించిన సమానత్వం, వ్యక్తిగత గౌరవం, గోప్యత వంటి మౌలిక విలువలకు దూరంగా ఉన్నట్టు సూచిస్తున్నాయని పేర్కొంది.

ఉత్తర్‌ప్రదేశ్ అమ్రోహాకు చెందిన ఓ బాధితురాలు.. తనకు 15 ఏళ్ల వయసు(2015)లో బలవంతంగా వివాహం జరిగినట్టు ఆరోపించారు. ఆ తర్వాత 2016లో భర్త ట్రిపుల్ తలాక్ ఇచ్చాడని, కానీ మరలా అతడినే పెళ్లాడాలంటే హలాలా తప్పనిసరని మతపెద్దలు బలవంతం చేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. హలాలా పేరిట ఓ వ్యక్తి తనను శారీరకంగా వేధించాడని, అనంతరం 2017 లో మరలా మొదటి భర్తతోనే వివాహం జరిగినట్లు ఆరోపించారు. ఆ తర్వాత 2021లో మరోసారి అతడు ట్రిపుల్ తలాక్ చెప్పి, వేరే మహిళను పెళ్లాడాడన్నారు. ఆ పిదప మళ్లీ కలిసి జీవిద్దామని చెప్పిన భర్త కుటుంబ సభ్యులు.. రెండు మార్లు తలాక్ జరిగినందున మరోసారి హలాలా చేయాల్సిందేనని బెదిరించారని ఆమె వాపోయారు. ఈ క్రమంలో 2025 ఫిబ్రవరిలో భర్త సోదరులు హలాలా పేరిట తనపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారన్న ఆమె.. ఆ తర్వాత నామమాత్రంగా ఓ నికాహ్ కూడా చేశారని చెప్పుకొచ్చారు.కాగా.. ఈ వ్యవహారం ముస్లిం వ్యక్తిగత చట్టాలు, మతపరమైన ఆచారాలకు సంబంధించినదని.. ఫలితంగా ఎఫ్ఐఆర్‌ను రద్దుచేయాలని న్యాయస్థానాన్ని కోరారు నిందితులు. అయితే.. ఈ వాదనల్ని ధర్మాసనం పూర్తిగా తిరస్కరించింది. క్రిమినల్ చట్టం అమలులో ఉండగా వ్యక్తిగత చట్టాలకు ప్రాధాన్యం ఇవ్వలేమని, చట్టంలో ప్రత్యేక మినహాయింపులేమైనా ఉన్నప్పుడే ఇలాంటి వాదనలకు అవకాశముంటుందని స్పష్టం చేసింది. బాలికలపై లైంగిక సంబంధాలకు వ్యక్తిగత చట్టాలను రక్షణగా చూపలేమని, అలాంటి కేసులకు పోక్సో చట్టం వర్తిస్తుందని పేర్కొంది. దీంతోపాటు గతంలో ఇచ్చిన తాత్కాలిక ఉత్తర్వులన్నింటినీ కోర్టు రద్దు చేయడంతో.. ఈ కేసును పోలీసులు పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

## ప్రతి కుటుంబం ఎస్ఐఆర్ ఫారాలు తప్పనిసరిగా సమర్పించాలి -పువ్వాడ అజయ్ కుమార్

ఖమ్మం, జులై 3: మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గురువారం తన కుటుంబ సభ్యుల ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత బీఎల్ఓ షాహీన్ కమల్‌కు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి కుటుంబం తమ ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా నింపి సంబంధిత బీఎల్ఓలకు సమర్పించాలని కోరారు.

ఫారాలు నింపడంలో లేదా వివరాలు నమోదు చేయడంలో ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే, బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రతి డివిజన్‌లో అందుబాటులో ఉన్న బీఎల్ఎస్ సభ్యులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు.

# సమ్మిళిత గ్రామీణ అభివృద్ధికి సహకార సంఘాలు

## (జూలై 04న "అంతర్జాతీయ సహకార దినోత్సవం" సందర్భంగా)

"అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని" 1923 నుండి ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ కోఆపరేటివ్ మూవ్‌మెంట్ చొరవతో జరుగుతూ వస్తోంది. ఐక్యరాజ్యసమితి (ఐరాసా) కూడా 1995 నుండి దీనిని పాటిస్తోంది. ఇది జూలై నెల మొదటి శనివారం, అనగా 04 జూలై 2026న నిర్వహించబడుతుంది. 2026లో, అంతర్జాతీయ సహకార దినోత్సవం 104వ వేడుకగా, 32వ ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సహకార దినోత్సవంగా నిలిచింది. సుస్థిర అభివృద్ధికి సహకార సంఘాలు అందించే తోడ్పాటుపై అవగాహన పెంచడానికి మరియు ఐక్యరాజ్యసమితికి, అంతర్జాతీయ సహకార ఉద్యమానికి మధ్య సహకారాన్ని బలోపేతం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సహకార సంఘాలు, ప్రభుత్వాలు, భాగస్వాములు మరియు వాటాదారులను ఒకచోట చేర్చడమే ఈ దినోత్సవం యొక్క లక్ష్యం. సహకార సంఘాలు సంఘర్షణలు లేకపోవడానికి మాత్రమే కాకుండా, సానుకూల శాంతికి అవసరమైన పునాదులైన న్యాయం, సమ్మిళితత్వం మరియు విశ్వాసం ఉండటానికి కూడా దీర్ఘకాలంగా తోడ్పాటు అందిస్తున్నాయి. ప్రపంచ సహకార ఉద్యమం అధికారికంగా 1844లో ఇంగ్లాండ్‌లో ప్రారంభమైంది.

### అంతర్జాతీయ సహకార దినోత్సవం-2026 యొక్క ఇతివృత్తం:

ప్రపంచవ్యాప్తంగా సామాజిక న్యాయం, సమ్మిళితత్వం మరియు సంఘీభావాన్ని పెంపొందించడంలో సహకార సంస్థల కీలక పాత్రను హైలైట్ చేస్తూ, ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సహకార దినోత్సవం-2026 యొక్క ఇతివృత్తాన్ని "శాంతియుత ప్రపంచం కోసం సహకార సంస్థలు"గా అధికారికంగా ప్రకటించారు. ప్రజాస్వామ్య భాగస్వామ్యం, ఆర్థిక సమ్మిళితత్వం, సామాజిక స్థితిస్థాపకత మరియు సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించడం ద్వారా శాంతియుత సమాజాల నిర్మాణానికి సహకార సంస్థలు ఎలా దోహదపడతాయో కూడా ఈ ఇతివృత్తం నొక్కి చెబుతుంది. సహకార సంస్థలు సమాజంలోని అన్ని వర్గాల వ్యక్తులను ఆర్థిక మరియు సామాజిక జీవితంలో పాల్గొనేలా చేస్తూ, అసమానతలను తగ్గించడానికి మరియు సమైక్యతను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. శాశ్వత శాంతి అనేది సామాజిక న్యాయంపై ఆధారపడి ఉండాలనే చిరకాల సూత్రంతో కూడా ఈ ఇతివృత్తం బలంగా ప్రతిధ్వనిస్తుంది. రోజురోజుకు విచ్ఛిన్నమవుతున్న ప్రపంచంలో, సహకార సంస్థలు వారధులుగా పనిచేస్తూ, సమాజాలను ఏకతాటిపైకి తీసుకురావడం, సంభాషణలను ప్రోత్సహించడం, మరియు పునరుద్ధరణ, స్థితిస్థాపకతను బలోపేతం చేయడంలో వాటి పాత్రను ఈ ఇతివృత్తం నొక్కి చెబుతుంది.

### భారతదేశంలో సహకార ఉద్యమం:

"సర్ ఫ్రెడరిక్ నికల్సన్"ను భారతదేశంలో సహకార ఉద్యమ మార్గదర్శకుడిగా మరియు "సహకార ఉద్యమ పితామహుడిగా" గుర్తిస్తారు. అయితే, ఈ బిరుదును రావు బహదూర్, ఎస్.ఎస్. తల్మాకి మరియు వైకుంఠభాయ్ ఎల్. మెహతా వంటి భారతీయ సంఘ సంస్కర్తలు కూడా తరచుగా




పంచుకుంటారు. భారతదేశంలోని సహకార ఉద్యమం అనేది అట్టడుగు వర్గాల ప్రజలకు సాధికారత కల్పించే ఒక శతాబ్దపు పురాతన సామాజిక-ఆర్థిక వ్యవస్థ. పరస్పర సహాయం మరియు సభ్యుల యాజమాన్యం అనే స్ఫూర్తితో పనిచేస్తూ, ఇది వ్యవసాయం, దాయి మరియు గృహనిర్మాణం వంటి కీలక రంగాలను ముందుకు నడిపిస్తుంది. ప్రభుత్వం ప్రత్యేక సహకార మంత్రిత్వ శాఖ ద్వారా ఈ ప్రయత్నాలను పర్యవేక్షిస్తూ, ఆధునీకరిస్తుంది. గ్రామీణ దుస్థితి మరియు వడ్డీ వ్యాపారుల దోపిడీ నుండి పుట్టిన ఈ ఉద్యమాన్ని బ్రిటిష్ ప్రభుత్వం "సహకార పరపతి సంఘాల చట్టం, 1904" ద్వారా సంస్థాగతం చేసింది. స్వాతంత్ర్యానంతర కాలంలో, ప్రజాస్వామ్య ప్రణాళిక మరియు గ్రామీణాభివృద్ధికి ఒక సాధనంగా సహకార సంఘాలను పంచవర్ష ప్రణాళికలలో విలీనం చేశారు. ఆర్థిక చేరిక, సమ్మిళిత వృద్ధి మరియు సుస్థిర జీవనోపాధి అనేవి భారతీయ సహకార ఉద్యమం యొక్క ప్రధాన లక్ష్యాలు. భారత సహకార వ్యవస్థ ప్రధానంగా భౌగోళికంగా మరియు పరిధిని బట్టి రుణ సహకార సంఘాలు, రుణేతర సహకార సంఘాలు మరియు బహుళ రాష్ట్ర సహకార సంఘాలుగా విభజించబడింది.

భారతదేశంలోని అగ్రగామి మూడు సహకార సంఘాలు అమూల్, ఇఫ్కో మరియు క్రిబ్కో. భారతదేశంలోని ఇతర ప్రముఖ సహకార సంఘాలు కెసిఎమ్ఎమ్ఎఫ్, యుఎల్‌సిసిఎస్, కెఎమ్ఎఫ్, ఓఎమ్ఎఫ్ఇడి, సరస్వతి కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, బియుసిసిఎస్ మరియు నాఫెడ్. తెలంగాణ గ్రామీణ, వ్యవసాయ మరియు సామాజిక-ఆర్థిక అభివృద్ధికి, అలాగే రుణం, మార్కెటింగ్ మరియు సంక్షేమం వంటి వివిధ రంగాలలో దాని నిర్మాణాత్మక అభివృద్ధికి సహకార రంగం చాలా కీలకమైనది. ఈ ఉద్యమానికి టిఎస్‌సిఎబి (ఖాఅంః) నాయకత్వం వహిస్తోంది. ముఖ్యమైన సహకార ప్రభుత్వ రంగ సంస్థలు (పిఎస్ఎసిఎస్), డిసిసిబిలు, టిఎస్‌డిడిసిఎఫ్, సహకార గృహ నిర్మాణ సంఘాలు, వినియోగదారు ఌ సూపర్‌మార్కెట్ సహకార సంఘాలు, టిఎస్‌సిఒ, టిజిడబ్ల్యుసిడిసి మరియు టిటిసిఎస్.

"అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025" తర్వాత వస్తున్న అంతర్జాతీయ సహకార దినోత్సవం-2026, సమ్మిళిత అభివృద్ధికి, శాంతికి చోదకాలుగా సహకార సంస్థల పాత్రను బలోపేతం చేయడానికి, మరియు ప్రపంచవ్యాప్తంగా మరింత న్యాయమైన, సుస్థిరమైన సమాజాల దిశగా కార్యాచరణను సమీకరించడానికి ఒక ముఖ్యమైన అవకాశాన్ని అందిస్తుంది. సహకార సంస్థలు అనేవి సంఘీభావం, భాగస్వామ్యం మరియు సుస్థిర అభివృద్ధిలో పాతుకుపోయిన ప్రజాస్వామ్య యాజమాన్య నమూనాలు. ప్రజలు స్వేచ్ఛగా, సంఘీభావంతో ఏకమై, తాము ప్రజాస్వామ్యబద్ధంగా సొంతం చేసుకుని, పరిపాలించే సంస్థల ద్వారా తమ ఉమ్మడి అవసరాలను తీర్చుకోగలరనే ఒక సరళమైన కానీ శక్తివంతమైన ఆలోచనపై ఇవి ఆధారపడి ఉన్నాయి.



-మధుపాళీ
9949700037

# షీ-లీప్స్: లఖ్‌పతి దీదీలకు డిజిటల్ సాధికారత

న్యూ ఢిల్లీ, జులై 3:డిజిటల్ సాధికారత ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధిలో విప్లవాత్మక మార్పులు

షీ-లీప్స్.. సెల్ఫ్ హెల్ప్ ఎంటర్‌ప్రెన్యూర్ లైవ్లీహుడ్స్ అండ్ ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ ఫర్ ప్రాస్పెరిటీ అండ్ సస్టైనబిలిటీ. దేశవ్యాప్తంగా గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాలు (ఎస్ హెచ్ జీలు) మహిళలను సాధికారత దిశగా నడిపించే డిజిటల్ వేదిక ఇది. వ్యాపారాల స్థాపన, వాటి పనితీరును పర్యవేక్షించేందుకు తోడ్పడుతుంది. గ్రామీణ మహిళల జీవనోపాధి సృష్టికి, వ్యాపార వృద్ధికి, ఆర్థిక సమ్మిళిత్వాన్ని ప్రోత్సహించటం షీ-లీప్స్ లక్ష్యం. వ్యవసాయ, వ్యవసాయేతర గ్రామీణ సంస్థలకు మద్దతినస్తూ.. బలమైన, స్థిరమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి దోహదపడుతుంది.

షీ-లీప్స్ మొబైల్ అప్లికేషన్‌ను డిజిటల్ ఇండియా కార్పొరేషన్ అభివృద్ధి చేయగా.. లోక్‌ఓఎస్ వేదిక ద్వారా అమలవుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న కమ్యూనిటీ ఆధారిత సంస్థల (సీబీఓలు) కార్యకలాపాలను నమోదు చేసేందుకు రూపొందించిన డిజిటల్ వ్యవస్థే లోక్‌ఓఎస్. ఈ సంస్థల్లో ఎస్‌హెచ్‌జీలు, గ్రామ సంఘాలు, క్లస్టర్ స్థాయి సమాఖ్యలు ఉన్నాయి. సభ్యుల రికార్డుల నిర్వహణ, ఆర్థిక లావాదేవీలు, జీవనోపాధి రికార్డులు, వివిధ ప్రభుత్వ పథకాల అనుసంధాన కార్యక్రమాలను పర్యవేక్షించటం వంటి కమ్యూనిటీ ఆధారిత సంస్థల (సీబీఓ) కార్యకలాపాలను డిజిటలైజ్ చేయటానికి లోక్‌ఓఎస్ సహాయపడుతుంది.

న్యూఢిల్లీలో జూన్ 29, 2026న జరిగిన రాష్ట్రీయ గ్రామీణ వికాస్ సమ్మేళనంలో షీ-లీప్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి' ఇతివృత్తంతో రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో ప్రధాన గ్రామీణ అభివృద్ధి పథకాల అమలు, పురోగతిని సమీక్షించారు. 'వికసిత్ గ్రామం - వికసిత్ భారత్' ప్రభుత్వ దార్శనికతను సాకారం చేసేందుకు వ్యూహాలను రూపొందించటంపై ఈ సదస్సు దృష్టి సారించింది.

షీ-లీప్స్ కార్యక్రమాన్ని 34 రాష్ట్రాలు, యూటీల్లో అమలు చేయనున్నారు. ఎంపిక చేసిన రాష్ట్రాలు, యూటీల్లోని రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి కార్యక్రమాలకు ఇది సహాయం అందిస్తుంది. గ్రామీణ ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన సంస్థాగత సమాచారాన్ని ఈ వేదిక ఎప్పటికప్పుడు సేకరిస్తుంది. తద్వారా గ్రామీణ ఆర్థిక ప్రగతిపై స్పష్టమైన అవగాహనను పెంపొందిస్తుంది. దీంతో వివిధ స్థాయుల్లో పర్యవేక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. ఫలితంగా క్షేత్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు విధానపరమైన నిర్ణయాలు తీసుకునేందుకు ఇది దోహదపడుతుంది.

### సంస్థాగత అభివృద్ధికి డిజిటల్ సేవలు

వివిధ రంగాల్లోని నిర్వహణ డేటాను షీ-లీప్స్ ఎప్పటికప్పుడు సేకరిస్తుంది. పూర్తి జీవనోపాధి ప్రయాణాన్ని ట్రాక్ చేస్తుంది. సంస్థ ప్రొఫైల్‌ను రూపొందించటం నుంచి సంస్థాగత పనితీరుని పరిశీలించటం వరకు ప్రతి దశలోనూ ఈ వేదిక మద్దతిస్తుంది. ఇది డిజిటల్ పర్యవేక్షణను మరింత బలోపేతం చేస్తుంది. పరిపాలనను మెరుగుపరుస్తుంది. మెరుగైన ప్రణాళికలు, అవసరమైన చర్యలు, సరైన విధానపరమైన నిర్ణయాలు తీసుకునేందుకు తోడ్పడుతుంది. షీ-లీప్స్ మొబైల్ అప్లికేషన్ ద్వారా అందించే సేవలు:

ఆదాయ వృద్ధి, ఉపాధి సంస్థల పనితీరును సమగ్రంగా పర్యవేక్షించటం ద్వారా లఖ్‌పతి దీదీ మిషన్‌ను షీ-లీప్స్ వేదిక మరింత బలోపేతం చేస్తుంది. ఇటీవల ప్రభుత్వం లఖ్‌పతి దీదీ పథక లబ్ధిదారుల లక్ష్యాన్ని 3 కోట్ల నుంచి 6 కోట్ల మందికి పెంచింది.

లఖ్‌పతి దీదీలకు లబ్ధి చేకూర్చేందుకు రానున్న అయిదేళ్లలో రూ.10 లక్షల కోట్లను విడుదల చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. మహిళా సాధికారత పట్ల ప్రభుత్వానికున్న బలమైన నిబద్ధతను ఇది తెలియజేస్తుంది. వ్యాపార విస్తరణను పెద్దఎత్తున ప్రోత్సహించే ప్రణాళికలో షీ-లీప్స్ మొబైల్ అప్లికేషన్ కీలక భాగం.

### మహిళల నేతృత్వంలో బలమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిర్మాణం

డిజిటల్ మౌలిక సదుపాయాలు, వ్యవస్థాపకత, మహిళా సాధికారతను ఏకం చేయటం ద్వారా డిజిటల్ గ్రామీణ పరివర్తనలో షీ-లీప్స్ ముందడుగును సూచిస్తుంది. సంస్థాగత వృద్ధికి మద్దతివ్వటం, ఆర్థిక సమగ్రతను బలోపేతం చేయటం ద్వారా లఖ్‌పతి దీదీ మిషన్‌ను దేశవ్యాప్తంగా విస్తరించటానికి ఈ వేదిక సహాయపడుతుంది. సమగ్ర, సుస్థిర గ్రామీణ పరివర్తనకు కీలక శక్తిగా ఇది నిలుస్తుంది.

# కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు అవస్థలు..

## -మరో బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్

ఆదిలాబాద్, జులై 3:మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటలోని కేంద్రీయ విద్యాలయానికి వెళ్లే విద్యార్థులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రవాణా సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలో పాఠశాల నిర్వహణలో ఉండగా తల్లిదండ్రులు తమ పిల్లలను సొంత వాహనాల్లో పాఠశాలకు తీసుకెళ్లేవారు. అనంతరం గుడిపేటలో శాశ్వత భవనం నిర్మాణం పూర్తికావడంతో పాఠశాలను అక్కడికి మార్చారు.

ప్రస్తుతం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీరాంపూర్, నస్పూర్, ఏసీసీ, హమాలీవాడ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు ఈ పాఠశాలకు వస్తున్నారు. వారి రాకపోకల కోసం టీజీఎస్ఆర్టీసీ ఒక బస్సును మాత్రమే ఏర్పాటు చేసింది. అయితే పాఠశాలలో చదివే దాదాపు 90 శాతం మంది విద్యార్థులు ఈ ప్రాంతాల నుంచే రావడంతో ఒక్క బస్సు సరిపోవడం లేదని తల్లిదండ్రులు




చెబుతున్నారు.

ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు విద్యార్థులంతా ఒకే బస్సుపై ఆధారపడాల్సి వస్తోందని, దీంతో రద్దీ కారణంగా ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొన్నారు.

విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని కేంద్రీయ విద్యాలయానికి అదనంగా మరో టీజీఎస్ఆర్టీసీ బస్సును మంజూరు చేయాలని జిల్లా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# సింగరేణిలో అధికారుల ఆందోళనలు ఉధృతం..

## -పే అప్‌గ్రేడ్, పీఆర్‌పీపై యాజమాన్యానికి హెచ్చరిక

## -ఐదో రోజు రిలే నిరాహార దీక్షలు.. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదంటున్న సీఎంఓఏఐ




కరీంనగర్, జులై 3: కోల్ ఇండియా తరహాలో పే అప్‌గ్రేడ్ అమలు చేయడంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ అఖిల భారత అధికారుల సంఘం (సీఎంఓఏఐ) ఆధ్వర్యంలో సింగరేణి అధికారులు తమ ఆందోళనలను ఉధృతం చేశారు. సింగరేణి కోల్‌బెల్ట్ పరిధిలోని అన్ని జీఎం కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి.

పే అప్‌గ్రేడ్‌ను వెంటనే అమలు చేయడంతో పాటు అధికారులకు రావాల్సిన పనితీరు ఆధారిత ప్రోత్సాహకం (పీఆర్‌పీ)ని తక్షణమే చెల్లించాలని అధికారుల సంఘం డిమాండ్ చేస్తోంది. సింగరేణి వ్యాప్తంగా ఐదు రోజులుగా రిలే నిరాహార దీక్షలు నిరవధికంగా కొనసాగుతున్నాయి.

శుక్రవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని సింగరేణి జీఎం కార్యాలయం వద్ద నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో మహిళా అధికారులు పాల్గొన్నారు. రామగుండం ఏరియా ఎస్‌వోటు జీఎం చంద్రశేఖర్, అధికారి హనుమంతరావు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో మహిళా అధికారులు ముగు రం బాంధవి, కారం పద్మ, డాక్టర్ డి. ప్రవం తి, ఎస్. సౌమ్య, రజిని తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధికారుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ పే అప్‌గ్రేడ్ అమలులో జాప్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత మూడు సంవత్సరాలుగా చెల్లించాల్సిన పీఆర్‌పీని ఇప్పటికీ విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగాలు, పదోన్నతుల విషయంలో పారదర్శకత పాటించాలని, బొగ్గు పరిశ్రమ మనుగడ కోసం కొత్త బొగ్గు బ్లాకులను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

అధికారులకు నష్టం కలిగే విధంగా వ్యవహరించడం సమంజసం కాదని పేర్కొన్న సంఘం ప్రతినిధులు, యాజమాన్యం, ప్రభుత్వం ఇప్పటికైనా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు.

# గురుకుల విద్యార్థి అదృశ్యం.. వీడిన మిస్టరీ

## -కేశవపట్నంలో బస్సులో ప్రయాణిస్తుండగా గుర్తింపు..

## -తల్లిదండ్రులకు అప్పగించేందుకు చర్యలు

ఆదిలాబాద్, జులై 3: మంచిర్యాల జిల్లా చెన్నూరులోని మహాత్మా జ్యోతిరావ్ పూలే గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి దుర్గం అర్ష అదృశ్యం వ్యవహారంలో చిక్కుముడి వీడింది. పోలీసులు వేగంగా స్పందించి విద్యార్థిని క్షేమంగా గుర్తించారు.

గురువారం పాఠశాల నుంచి విద్యార్థి కనిపించకపోవడంతో పాఠశాల ప్రిన్సిపాల్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన చెన్నూరు పోలీసులు తమ సాంకేతిక పరిజ్ఞానం, పోలీసు నెట్‌వర్క్‌ను వినియోగించి రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు విద్యార్థి వివరాలను పంపించి గాలింపు చర్యలు చేపట్టారు.

ఈ క్రమంలో శుక్రవారం కరీంనగర్ జిల్లా కేశవపట్నం పోలీసులు బస్సులో ప్రయాణిస్తున్న అర్షను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విద్యార్థి క్షేమంగా ఉన్నట్లు చెన్నూరు పోలీసులకు సమాచారం అందించారు.


విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగించేందుకు చెన్నూరు పోలీసు సిబ్బంది కేశవపట్నంకు బయలుదేరినట్లు సమాచారం. కొద్ది గంటల్లోనే అదృశ్యమైన విద్యార్థిని గుర్తించి క్షేమంగా వెలికితీసిన చెన్నూరు పోలీసుల పనితీరును స్థానికులు, పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు.

ఆహ్వానము
జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్
డా॥రావూరి భరద్వాజ జయంత్యోత్సవం




జ్ఞానపీఠ పురస్కార స్వీకర్త డా॥రావూరి భరద్వాజ
స్మారక సాహితీ పురస్కారాన్ని
శ్రీ పరవస్తు లోకేశ్వర్ గారికి
శ్రీమతి రావూరి కాంతమ్మ స్మారక సేవా పురస్కారాన్ని
శ్రీమతి హరిప్రియ గారికి ప్రదానం

పురస్కార స్వీకర్తలు
శ్రీ పరవస్తు లోకేశ్వర్



సాహిత్యం
10,000/- రూపాయల నగదు పురస్కారం

శ్రీమతి హరిప్రియ




సంగీతం
5000/- రూపాయల నగదు పురస్కారం

ముఖ్యఅతిథి : డా॥పాలకుర్తి మధుసూదనరావు
పూర్వ సి.ఇ.ఒ.శ్రీ వేంకటేశ్వర భక్తిఛానల్, టి.టి.డి.
సభాధ్యక్షులు : శ్రీ బైస దేవదాసు
సంపాదకులు, నేటినిజం దినపత్రిక
ఆత్మీయ అతిథి : శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ
సాహితీవేత్త
సభాప్రారంభం : శ్రీ పొత్తూరి సుబ్బారావు
సంపాదకులు, సాహితీకిరణం
అతిథిసత్కారం : శ్రీ రావూరి వెంకట కోటేశ్వరరావు
ధర్మకర్త (ట్రస్టీ), డా॥రావూరి భరద్వాజ - రావూరి కాంతమ్మ ట్రస్ట్
సభానిర్వహణ : శ్రీ పెద్దూరి వెంకటదాసు
కవి, రచయిత

సాంస్కృతిక కార్యక్రమం
చిన్నారి శ్రీధృతి తిమ్మరాజుచే 'రామాయణశబ్దం' కూచిపూడి నృత్యం
&
కోమల సమన్విత కూచిపూడి నృత్యాలయంవారి కూచిపూడి నృత్యం

తేది:05.07.2026, ఆదివారం సా॥5.00గం॥లకు
కళాలలిత కళావేదిక (శ్రీ త్యాగరాయ గానసభ), చిక్కడపల్లి, హైదరాబాద్
లయన్ వి.వి.రాఘవరెడ్డి
ప్రధాన కార్యదర్శి : 9866332738

# సింగరేణి అధికారుల పే అప్‌గ్రేడ్ వెంటనే అమలు చేయాలి: పుట్ట మధుకర్



కరీంనగర్, జులై 3: సింగరేణి అధికారుల పే అప్‌గ్రేడ్, పీఆర్‌పీ బకాయిలను వెంటనే అమలు చేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ డిమాండ్ చేశారు. గురువారం గోదావరిఖనిలోని సింగరేణి జీఎం కార్యాలయం వద్ద అధికారుల సంఘం చేపట్టిన రిలే నిరాహార దీక్షలను టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తితో కలిసి సందర్శించి సంఘీభావం తెలిపారు. 137 ఏళ్ల సింగరేణి చరిత్రలో అధికారులు తమ హక్కుల కోసం రోడ్డెక్కడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.

సింగరేణి గత రెండేళ్లలో సాధించిన లాభాల్లో రూ.6 వేల కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించిన ఆయన, అధికారులకు చెల్లించాల్సిన రూ.230 కోట్ల పీఆర్‌పీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే అధికారుల పోరాటానికి బీఆర్ఎస్, టీబీజీకేఎస్ పూర్తి మద్దతు ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

# మార్నింగ్ వాక్‌లోనే పారిశుధ్య తనిఖీలు..

కరీంనగర్, జులై 3: (నేటి నిజం ప్రతినిధి) పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహిస్తూ పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. మినీ ట్యాంక్‌బండ్‌పై వాకింగ్ చేస్తూ ఎల్లమ్మ, గుండమ్మ చెరువుల పరిసరాలను పరిశీలించి వాకర్లకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

అనంతరం ఉదయాన్నే మున్సిపల్ కార్మికులు చేపడుతున్న పారిశుధ్య పనులను స్వయంగా తనిఖీ చేశారు. జెండా చౌరస్తా, చందపల్లి రోడ్డులో పర్యటించిన ఆయన వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వార్డు అధికారులు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

పట్టణ ప్రజలు ఇంటి నుంచి వచ్చే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని కోరారు. రోడ్లు, మురుగు కాలువలు, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తున్న వారిని గుర్తించి మున్సిపల్ చట్టం ప్రకారం జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

స్వచ్ఛ పెద్దపల్లి లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్లు రామ్మోహన్ రెడ్డి, పులిపాక రాజు, ట్యాంక్‌బండ్ ఇన్‌చార్జి వునుకొండ మధు, జవాన్లు జయరాజ్, కరుణాకర్, మోహన్, చిన్న, వేణులాల్ తదితరులు పాల్గొన్నారు.

# 90 ఏళ్ల ఉత్సవాల్లో భాగంగా 'స్వర ప్రేరణ వీధిక' పేరుతో ప్రత్యేక గ్యాలరీని ప్రారంభించిన ఆకాశవాణి

న్యూఢిల్లీ, జులై 3:ఆకాశవాణి 90 సంవత్సరాల వేడుకలు, 2027లో భారతదేశంలో రేడియో ప్రసారాల శతాబ్ది ఉత్సవాల సన్నాహకాల్లో భాగంగా ఆకాశవాణి ఈరోజు 'స్వర ప్రేరణ వీధిక'ను ప్రారంభించింది. ఆకాశవాణికీ, భారతదేశ దిగ్గజ సంగీత విద్వాంసులకు మధ్య ఉన్న చిరస్మరణీయమైన అనుబంధాన్ని చాటిచెప్పేలా ఈ ప్రత్యేక ఫోటో గ్యాలరీని ఏర్పాటు చేశారు. న్యూఢిల్లీ ఆకాశవాణి భవన్ లోని ఆకాశవాణి రంగ్ భవన్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో పద్మవిభూషణ్ పండిట్ హరిప్రసాద్ చౌరాసియా ఈ గ్యాలరీని ప్రారంభించారు.

దాదాపు తొమ్మిది దశాబ్దాలుగా దేశంలోనే అగ్రగామి ప్రజా సేవా ప్రసార మాధ్యమంగా ఆకాశవాణి సేవలందిస్తోంది. దిగ్గజ కళాకారుల ప్రదర్శనలను దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది శ్రోతలకు చేరవేయడం ద్వారా భారతదేశ సంపన్న సంగీత వారసత్వాన్ని సంరక్షించడంలో, ప్రాచుర్యం కల్పించడంలో కీలక పాత్ర పోషించింది. ఆకాశవాణికి ఉన్న ఈ చిరస్మరణీయమైన వారసత్వానికి ఘనమైన గుర్తింపుగా రూపుదిద్దుకున్న 'స్వర ప్రేరణ వీధిక' ఆకాశవాణితో అత్యంత సన్నిహిత అనుబంధాన్ని కలిగి ఉండి, దేశ అత్యున్నత పౌర పురస్కారాలను అందుకున్న ప్రముఖ కళాకారులను గౌరవిస్తుంది. భారతీయ సంగీతానికి వారు అందించిన అమూల్యమైన సహకారాన్ని భవిష్యత్ తరాల కళాకారులకు, సంగీత ప్రియులకు స్ఫూర్తిగా నిలుపుతూ, ఆ వారసత్వాన్ని పదిలపరచడమే ఈ వినూత్న ప్రయత్నం ముఖ్య ఉద్దేశం.



ఈ వినూత్న ప్రయత్నంలో భాగంగా మొదటి విడతలో 20 మంది ప్రముఖ సంగీత దిగ్గజాల చిత్రపటాలను ఆవిష్కరించారు. ఈ గ్యాలరీలో భారతరత్న గ్రహీతలు విదుషీ ఎం.ఎస్. సుబ్బులక్ష్మి (కర్ణాటక గాత్రం), పండిట్ రవిశంకర్ (సితార్), విదుషీ లతా మంగేష్కర్ (నేపథ్య గానం), ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ (షెహనాయ్), పండిట్ భీమ్‌సేన్ జోషి (హిందుస్తానీ శాస్త్రీయ గాత్రం), డాక్టర్ భూపేన్ హజారికా (జానపద సంగీతం) ల చిత్రాలు కొలువుదీరాయి. వారితో పాటు పద్మవిభూషణ్ గ్రహీతలు పండిట్ హరిప్రసాద్ చౌరాసియా (బాంసురి/పిల్లనగ్రోవి), ఉస్తాద్ అంజాద్ అలీ ఖాన్ (సరోద్), ఉస్తాద్ అల్లావుద్దీన్ ఖాన్ (సరోద్) లను కూడా ఇందులో గౌరవించారు. పద్మభూషణ్ గ్రహీతలు – ఉస్తాద్ హఫీజ్ అలీ ఖాన్ (సరోద్), పండిట్ బిర్జు మహారాజ్ (కథక్),ఉస్తాద్ అహ్మద్ జాన్ తిరఖ్వా (తబలా) పండిట్ కృష్ణారావు శంకర్ పండిట్ (హిందుస్తానీ గాత్రం), విదుషీ షానో ఖురానా (గాత్రం), పండిట్ దేబూ చౌధురి (సితార్), విదుషీ శరణ్ రాణి బాక్లివాల్ (సరోద్), ఉస్తాద్ సాబ్రి ఖాన్ (సారంగి), పండిట్ రాజన్ మిశ్రా మరియు పండిట్ సాజన్ మిశ్రా (హిందుస్తానీ గాత్రం),ఉస్తాద్ అసద్ అలీ ఖాన్ (రుద్ర వీణ), ఉస్తాద్ ముస్తాక్ హుస్సేన్ ఖాన్ (హిందుస్తానీ గాత్రం) ల చిత్రపటాలను కూడా ఈ గ్యాలరీలో పొందుపరిచారు.

ఈ సందర్భంగా ప్రసార భారతి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) శ్రీ గౌరవ్ ద్వివేది మాట్లాడుతూ 'స్వర ప్రేరణ వీధిక' ప్రారంభం, దేశంలోని అగ్రగామి సాంస్కృతిక సంస్థలలో ఒకటిగా ఆకాశవాణి నిలబడటానికి తమ అమూల్యమైన సహకారాన్ని అందించిన దిగ్గజ కళాకారులకు కృతజ్ఞతలు తెలుపుకునే ప్రక్రియలో మొదటి దశ మాత్రమేనని పేర్కొన్నారు. రాబోయే దశల్లో మరి కొంతమంది ప్రముఖ కళాకారుల చిత్రపటాలను ఈ గ్యాలరీలో చేర్చుతామని, అలాగే దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఆకాశవాణి కేంద్రాలలో కూడా ఆయా ప్రాంతీయ దిగ్గజ సంగీత విద్వాంసుల గౌరవార్థం ఇటు వంటి గ్యాలరీలను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

భారతీయ సంగీతం పట్ల ఆకాశవాణికి ఉన్న నిరంతర నిబద్ధతను వివరిస్తూ, శ్రోతల విభిన్న అభిరుచులకు అనుగుణంగా సేవలందిస్తూనే, తరాల నాటి కళాకారులకు తమ ప్రతిభను చాటుకోవడానికి ఒక గొప్ప వేదికను కల్పించడం ద్వారా ఈ ప్రభుత్వ ప్రసార మాధ్యమం వివిధ విభిన్న సంగీత సంప్రదాయాలను నిరంతరం ప్రోత్సహిస్తూ వస్తోందని ఆయన అన్నారు.

హిందుస్తానీ శాస్త్రీయ సంగీతం కోసం ప్రత్యేకించిన 'రాగం', భక్తి సంగీతం కోసం ఉద్దేశించిన 'ఆరాధన' ఆకాశవాణి డిజిటల్ ఛానళ్లు యూట్యూబ్, న్యూస్-ఆన్-ఎయిర్ యాప్‌తో పాటు వేవ్స్ ఓటీటీ వేదికపై కూడా 24 గంటలూ అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. భారతదేశ సంపన్న సంగీత వారసత్వాన్ని దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రోతలకు చేరవేయడంలో ఆకాశవాణి కళాకారులు అత్యంత కీలకమైన పాత్ర పోషించారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

ఈ సందర్భంగా పద్మవిభూషణ్ పండిట్ హరిప్రసాద్ చౌరాసియా మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి హాజరు కావడం తన "సొంత ఇంటికి తిరిగి రావడం" లాంటిదని అభివర్ణించారు. ఆకాశవాణి 'బాలల కార్యక్రమం' ద్వారానే తన సంగీత ప్రయాణం ప్రారంభమైందని ఆయన గుర్తుచేసుకున్నారు. తరతరాల కళాకారులను ఆదరించి, ప్రోత్సహించిన ఒక గొప్ప కుటుంబంగా ఆకాశవాణిని పేర్కొంటూ, ఈ సంపన్న సాంస్కృతిక సంప్రదాయం ముమ్ముందు కూడా ఇలాగే వర్ధిల్లుతుందని, దేశవ్యాప్తంగా ఉన్న శ్రోతల ఆదరాభిమానాలను ఈ సంస్థ ఎల్లప్పుడూ పొందుతూనే ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పండిట్ హరిప్రసాద్ చౌరాసియా అగ్రగణ్య శిష్యులలో ఒకరైన పండిట్ రూపాక్ కులకర్ణి అద్భుతమైన వేణుగాన ప్రదర్శన ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.. మైహార్ ఘరానాకు చెందిన ప్రముఖ వేణుగాన విద్వాంసుడు పండిట్ కులకర్ణి అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన కళాకారుడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలు అందుకున్న ఆయన, ఆకాశవాణి టాప్ గ్రేడ్ కళాకారుడు కూడా. తన ఆరాధ్య గురువు సమక్షంలో ఆయన అందించిన హృద్యమైన వేణుగాన కచేరీ శ్రోతలను విశేషంగా అలరించి, వారి ఘనమైన ప్రశంసలు అందుకుంది.

# కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షాతో 'జనాభా మార్పులపై ఉన్నత స్థాయి అధ్యయన కమిటీ' సమావేశం

న్యూ ఢిల్లీ, జులై 3:దేశంలో జనాభా మార్పులపై అధ్యయనం కోసం ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ ఇవాళ న్యూఢిల్లీలోని హోం శాఖ మంత్రి శ్రీ అమిత్ షా నివాసంలో ఆయనతో లాంఛనప్రాయంగా సమావేశమైంది.

తమకు అప్పగించిన బాధ్యతల మేరకు క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష అధ్యయనం దిశగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పర్యటన సహా ఇతర నిర్ణయాలపై కమిటీ ఈ సందర్భంగా మంత్రికి సమాచారమిచ్చింది. అలాగే, జనాభా మార్పులపై అభిప్రాయ సేకరణ కోసం ఇతర కేంద్ర మంత్రిత్వశాఖలతో సంప్రదింపులు చేపట్టేందుకు సంసిద్ధత తెలిపింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పర్యటన పరస్పర సంప్రదింపులతో అర్థవంతంగా సాగేలా ముందస్తు సమాచార సమీకరణకు నిర్ణయించినట్లు వెల్లడించింది. ఇందుకోసం ఒక సమగ్ర ప్రశ్నావళిని కూడా రూపొందించామని తెలిపింది.

ఈ సమాచారంపై శ్రీ అమిత్ షా స్పందిస్తూ- ఉన్నత స్థాయి కమిటీ వ్యూహాన్ని ప్రశంసించారు. దీనికి అనుగుణంగా కమిటీ దైనందిన కార్యకలాపాలకు వీలైనంత మేర సహాయసహకారాలు అందించాలని తమ శాఖ కార్యదర్శిని ఆయన ఆదేశించారు. కమిటీ కూడా తన నిర్ణయాల మేరకు వేగంగా అధ్యయనం పూర్తిచేసి, సాధ్యమైనంత త్వరగా తగిన సిఫారసులతో నివేదిక అందజేయాలని మంత్రి సూచించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2025 ఆగస్టు 15న "జనాభా మార్పులపై అత్యున్నత స్థాయి కార్యక్రమం" ప్రకటించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. దేశంలోకి అక్రమ వలసలు, ఇతర అసాధారణ కారణాలతో తలెత్తే జనాభా మార్పులపై అధ్యయనం సహా తత్సంబంధ పరిణామాలపై చర్యలకు తగిన సిఫారసులతో నివేదిక సమర్పణకు ఆదేశించింది.

ఈ కమిటీకి జస్టిస్ (రిటైర్డ్) ప్రకాష్ ప్రభాకర్ నావ్లేకర్ అధ్యక్షత వహిస్తుండగా జనగణన విభాగం కమిషనర్ సహా శ్రీ దుర్గాశంకర్ మిశ్రా (రిటైర్డ్ ఐఏఎస్), శ్రీ బాలాజీ శ్రీవాస్తవ (రిటైర్డ్ ఐపీఎస్), డాక్టర్ షమికా రవి (పీఎంఈఏసీ సభ్యురాలు) తదితర ప్రముఖులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. భారత్‌లోకి అక్రమ వలసలతోపాటు ఇతరత్రా అసాధారణ కారణాల వల్ల వివిధ ప్రాంతాలలో జనాభాపరంగా చోటుచేసుకుంటున్న మార్పులపై ఈ ఉన్నత స్థాయి కమిటీ కూలంకషంగా, శాస్త్రీయంగా అధ్యయనం నిర్వహిస్తుంది. అనంతరం కారణాలు -పర్యవసానాలను సమగ్రంగా విశ్లేషించి తదనుగుణ విధాన, చట్టబద్ధ, పాలనపరమైన చర్యలపై సిఫారసులతో ఒక నివేదికను సమర్పిస్తుంది.

# హిందుస్తాన్ కాపర్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా పదవీబాధ్యతలు స్వీకరించిన శ్రీ అనుపమ్ మిశ్రా

న్యూఢిల్లీ, జులై 3:శ్రీ మిశ్రా తన వ్యూహాత్మక దృష్టికోణాన్నీ, వాణిజ్య సంబంధ నైపుణ్యాన్నీ, నిరూపిత నాయకత్వంతో కూడిన అరుదైన సామర్థ్యాన్నీ ఇక హెచ్‌సీఎల్‌కు అందిస్తారు. ఈ సంస్థ త్వరితగతిన అభివృద్ధి చెందడానికీ, భారత్‌లో కీలక ఖనిజాలతో పాటు రాగి రంగ భద్రతను దృఢతరంగా తీర్చిదిద్దుకోవడంలో సంస్థ పోషించాల్సిన పాత్రను బలోపేతం చేయడానికీ శ్రీ మిశ్రా తోడ్పాటును అందించనున్నారు.

శ్రీ మిశ్రా ఐఐటీ ఖరగ్‌పూర్‌లో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ (ఆనర్స్) చదువుకున్నారు. ఆయన ఐఐఎమ్ లక్నో నుంచి పీజీడీఎమ్ నూ, ఐఐఎమ్ అహ్మదాబాద్, ఐఐఎమ్ కోల్‌కతా నుంచి ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రాములనూ పూర్తి చేశారు. శ్రీ మిశ్రా అనుభవజ్ఞుడైన మేనేజ్‌మెంట్ వృత్తి నిపుణుడు. ఆయనకు మార్కెటింగ్, అంతర్జాతీయ వాణిజ్యం, వాణిజ్యాభివృద్ధిలో 33 సంవత్సరాల కన్నా ఎక్కువ అనుభవం ఉంది. ఖనిజాలు, లోహాలు, రసాయనాలు, ఇంజినీరింగ్ సామగ్రి, ప్రాజెక్టు వాణిజ్యంలో శ్రీ మిశ్రా అపార నైపుణ్యాన్ని సంపాదించారు.

హెచ్‌సీఎల్‌లో పదవీ బాధ్యతలను స్వీకరించడాని కన్నా ముందు, 2020 జులై నుంచి 2026 జూన్ వరకూ ఫర్టిలైజర్స్, కెమికల్స్ ట్రావెన్కూర్ (ఎఫ్ఏసీటీ)లో డైరెక్టర్ (మార్కెటింగ్)గా శ్రీ మిశ్రా సేవలను అందించారు. ఎఫ్ఏసీటీలో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను కూడా నిర్వహించారు. బోర్డు స్థాయి నాయకత్వంలో విశేష అనుభవంతో పాటు వ్యూహాత్మక, వాణిజ్య అవగాహన శక్తిని కూడా చాటారు.

శ్రీ మిశ్రా పదవీ బాధ్యతలను స్వీకరించిన తరువాత హెచ్‌సీఎల్ నిర్వహణ, వ్యూహ సంబంధ ప్రాధాన్యాల్ని సమీక్షించడానికి సంస్థ ఫంక్షనల్ డైరెక్టర్లతో సమావేశమయ్యారు. నిర్వహణ సంబంధిత అంశాలు, సంస్థ ఆధ్వర్యంలో ప్రస్తుతం పురోగమిస్తున్న ప్రాజెక్టుల పనులే కాకుండా సంస్థ అభివృద్ధికి చెందిన ప్రాథమిక ప్రణాళికను చర్చించడానికి కార్పొరేట్ కార్యాలయంలో వివిధ విభాగాల సారథులతో దృశ్య మాధ్యమం ద్వారా ఒక సమావేశాన్ని శ్రీ మిశ్రా నిర్వహించారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా

## -మూడు లారీలు, ఎస్కార్ట్ వాహనం సీజ్ చేసిన వైరా పోలీసులు



ఖమ్మం, జులై 3:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలతో పాటు, ఓ లారీకి ఎస్కార్ట్ వాహనంగా ఉన్న కారును వైరా పోలీసులు గురువారం రాత్రి పట్టుకొని సీజ్ చేశారు. ఈ అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన నలుగురు వ్యక్తులను మధిర కోర్టులో రిమాండ్ కు పంపారు. ఈ అక్రమ వ్యాపారం చేస్తున్న వారు పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు నిరంతరం లారీలు, ఎస్కార్ట్ వాహనం రిజిస్ట్రేషన్ నెంబర్లు మార్చేందుకు వీరి వద్ద ఉన్న రేడియం స్టిక్కర్లు సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వైరా ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఇసుక రీచ్ నుంచి హైదరాబాద్ కు నిరంతరం ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. దీంతో గురువారం సాయంత్రం వైరా ఎస్ఐ పుష్పాల రామారావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సోమవారం గ్రామ సమీపంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో కొవ్వూరు నుంచి హైదరాబాద్ కు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలను, ఎస్కార్ట్ గా ఉన్న ఒక స్విఫ్ట్ డిజైర్ కారును పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు.

అంతేకాకుండా పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు లారీలు, ఎస్కార్ట్ గా ఉన్న కారు నెంబర్లను నిరంతరం మార్చేందుకు ఉపయోగించే రేడియం స్టిక్కర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న నల్గొండ జిల్లాకు చెందిన లారీ యజమానులు, డ్రైవర్లు ఇస్లావత్ భిక్షు, ముక్కుమాల యాదయ్య, దామ సైదులు, వాంకుడోత్ లింగా నాయక్, బచ్చుబోయిన యాదయ్యలపై వైరా పోలీసులు కేసు నమోదు చేశారు.

వీరిలో బచ్చుబోయిన యాదయ్య పరారీలో ఉండగా మిగిలిన నలుగురిని అరెస్టు చేసి మధిర కోర్టులో రిమాండ్ కు పంపారు. ఈ సందర్భంగా ఎస్సై పుష్పాల రామారావు మాట్లాడుతూ అనుమతు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణా సమాచారాన్ని ప్రజలు పోలీసులకు అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశ నిర్మాణంలో జీఎస్టీ పాత్రను కొనియాడిన గౌరవ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

న్యూఢిల్లీ, జులై 3:భారతదేశ అత్యంత కీలకమైన పరోక్ష పన్ను సంస్కరణల్లో ఒకటైన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలులోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా నేడు హైదరాబాద్‌లో 9వ జీఎస్టీ దినోత్సవం 2026 వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ హైకోర్టు గౌరవ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. 2017 జులై 1న ప్రారంభమైన జీఎస్టీ దేశ పరోక్ష పన్నుల వ్యవస్థను పూర్తిగా మార్చివేసిన ఒక మైలురాయి లాంటి సంస్కరణ అని అభివర్ణించారు. డిజిటలైజేషన్, ఏకరూపత, సహకార సమాఖ్య స్ఫూర్తి ద్వారా జీఎస్టీ దేశ పరోక్ష పన్నుల నిర్మాణాన్ని సరళతరం చేసిందని, పన్ను పరిపాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా, పన్ను చెల్లింపుదారులకు అనుకూలంగా మార్చిందని ఆయన పేర్కొన్నారు.

సాంకేతికత ఆధారిత నిబంధనల అమలు పన్ను పరి పాలనను ఆధునీకరించినప్పటికీ, డిజిటల్ నోటీసులు, ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటిసి), అప్పీళ్ల కాలపరిమితి వంటి అంశాల్లో సరికొత్త చట్టపరమైన, కార్యాచరణ సవాళ్లకు కూడా దారితీసిందని గౌరవ ప్రధాన న్యాయ మూర్తి అభిప్రాయపడ్డారు. నిరంతర అవగాహన, సామర్థ్య పెంపుదల కార్యక్రమాల ఆవశ్యకతను నొక్కిచెబుతూ.. మారుతున్న జీఎస్టీ వ్యవస్థను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పన్ను చెల్లింపుదారులు, చట్టపరమైన నిపుణులు, పన్ను అధికారులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

జీఎస్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడానికి పలు సూచనలు చేస్తూ.. కాలపరిమితి ముగిసిన అప్పీళ్ల కోసం అమ్నెస్టీ అవకాశం, జీఎస్టీఎన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ వివాద పరిష్కార వ్యవస్థ, పన్ను అక్షరాస్యత కార్యక్రమాల నిర్వహణ వంటి చర్యలు వ్యాజ్యాలను తగ్గించి, స్వచ్ఛంద పన్ను చెల్లింపులను ప్రోత్సహిస్తాయని జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ప్రతిపాదించారు. పటిష్టమైన జీఎస్టీ వ్యవస్థను నిర్మించడంలో పన్ను చెల్లింపుదారులు, పన్ను నిపుణులు, పన్ను పరిపాలనా యంత్రాంగం కలిసికట్టుగా పనిచేయాలని, బలమైన, పారదర్శకమైన, స్వయంసమృద్ధ భారతదేశ నిర్మాణానికి నిజాయితీతో కూడిన పన్ను చెల్లింపులే అత్యంత అవసరమని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా హైదరా బాద్ జోన్ సెంట్రల్ టాక్స్ ఉ కస్టమ్స్ చీఫ్ కమిషనర్ శ్రీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్లలో పన్ను నిబంధనల అమలును బలోపేతం చేయడం, డిజిటల్ గవర్నెన్స్ ను ప్రోత్సహించడం, సులభతర వాణిజ్యాన్ని మెరుగుపరచడం ద్వారా జీఎస్టీ భారతదేశ పరోక్ష పన్నుల వ్యవస్థను మార్చివేసిందని పేర్కొన్నారు.

జీఎస్టీ సాధించిన విజయాలను వివరిస్తూ.. 2017లో ప్రారంభమైనప్పటి నుంచి నెలవారీ జీఎస్టీ వసూళ్లు రెండింతలు పైగా పెరిగాయని, నమోదిత పన్ను చెల్లింపుదారుల సంఖ్య దాదాపు 60 లక్షల నుంచి 1.65 కోట్లకు పైగా పెరిగిందని ఆయన గుర్తుచేశారు. పన్ను వసూళ్లలో గణనీయమైన వృద్ధి, పన్ను చెల్లింపుదారుల సంఖ్య భారీగా పెరగడంతో హైదరాబాద్ సీజీఎస్టీ జోన్ అద్భుతమైన పనితీరును కనబరిచిందని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

పన్ను రీఫండ్‌ల వేగవంతమైన ప్రాసెసింగ్, సెంట్రల్ జీఎస్టీ, స్టేట్ జీఎస్టీ, జీఎస్టీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీల మధ్య మెరుగైన సమన్వయం వంటి పన్ను చెల్లింపుదారుల కేంద్రంగా చేపట్టిన పలు కార్యక్రమాలను శ్రీ అరుణ్ కుమార్ వివరించారు, అలాగే పన్ను వివాద పరిష్కారానికి తోడ్పడే జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ అందుబాటులోకి రావడాన్ని ఆయన స్వాగతించారు. పన్ను చెల్లింపుదారుల అవగాహన, మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాధాన్యతను నొక్కిచెబుతూ, భారతదేశ ఆర్థిక వృద్ధికి మద్దతు ఇచ్చే పారదర్శకమైన, సమర్థవంతమైన, సమగ్రమైన పన్ను వ్యవస్థను నిర్మించడానికి పన్ను చెల్లింపుదారులు, వ్యాపారాలు, పన్ను నిపుణులు, పన్ను అధికారుల మధ్య నిరంతర సహకారం అవసరమని కోరారు.

# 'మెంబర్షిప్ టు లీడర్షిప్'తో జనసేన కొత్త అడుగు..

న్యూఢిల్లీ, జులై 3: జనసేన పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నిర్మాణ సాధకుల సమాచార సేకరణ' కార్యక్రమానికి గుడివాడ నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులు, సాధకులు, వీర మహిళలు భారీ సంఖ్యలో మచిలీపట్నంలోని సమాచార సేకరణ వేదికకు తరలివెళ్లారు.

ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ, పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాయకత్వ బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తి ఉన్న వారి దరఖాస్తులను మచిలీపట్నం పార్లమెంట్ వేదికగా పార్లమెంట్ పరిశీలకుడు ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్‌కు అందజేస్తున్నట్లు తెలిపారు.

గుడివాడ నియోజకవర్గం నుంచి సుమారు 100 మంది సాధకులు, వీర మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

జనసేన పార్టీ నిర్మాణంలో తాము కూడా భాగస్వాములు కావాలనే సంకల్పంతో తమ బయోడేటాలను పార్టీ దృష్టికి సమర్పిస్తున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు సందు పవన్, పంచకర్ల అమర్, కోయిలాపు రాము, పెద్ది కిషోర్, కూరపాటి విజయ్, కోటపల్లి దాసు, సయ్యద్ నజీర్, గంట వంశీ, గొల్లపల్లి నాగబాబు, గంటా చైతన్య, అర్జ కృష్ణ, రాజేష్ పరుచూరి, వాసా నవీన్, వంగలపూడి రాము, గాడి కిరణ్, సీతాల రామకృష్ణ, గడ్డం శ్రీను, అలాగే వీర మహిళలు సీతాల సుభాషిణి, జడి మేను కనకదుర్గ, నూరత్ హిమజవల్లి, కొప్పర్తి విమలకుమారి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా డీఆర్ఐ నిర్వహించిన దాడుల్లో అక్రమ బంగారం తయారీ కేంద్రం గుట్టు రట్టు

న్యూఢిల్లీ, జులై 3:దేశ సరిహద్దుల ద్వారా బంగారం అక్రమ రవాణాపై నిరంతర నిఘాలో భాగంగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు ఢిల్లీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మరో పెద్ద స్మగ్లింగ్ ముఠాను పట్టుకున్నారు. ఈ ముఠా ఈశాన్య ప్రాంతం నుంచి విదేశీ మార్కు ఉన్న బంగారాన్ని వేర్వేరు వ్యక్తులతో రైళ్ల ద్వారా ఢిల్లీకి స్మగ్లింగ్ చేస్తోంది. వారు పట్టుబడే అవకాశం లేకుండా ప్రయాణ సమయాలను ఒక పద్ధతి ప్రకారం మారుస్తూ వస్తోంది. వీరు ఢిల్లీలో అత్యంత రద్దీగా ఉండే ఒక నివాస ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా బంగారం కరిగించే కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు కూడా డీఆర్ఐ అధికారులు గుర్తించారు.

జూన్ 26న అత్యంత పకడ్బందీగా సమన్వయం చేసుకుంటూ డీఆర్ఐ అధికారులు నిర్వహించిన ఒక ఆపరేషన్‌లో, పశ్చిమ బెంగాల్‌లోని న్యూ కూచ్ బెహార్ రైల్వే స్టేషన్, బిహార్‌లోని మాన్సీ జంక్షన్ వద్ద ఇద్దరు వ్యక్తులను అడ్డుకున్నారు. వారి శరీర భాగాల్లో దాచి ఉంచిన సుమారు 2 కిలోల బరువున్న బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. ఇదే సమయంలో ఢిల్లీలో కూడా సుమారు 1.2 కిలోల స్మగ్లింగ్ బంగారంతో పాటు మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి దర్యాప్తు ఢిల్లీలో గుట్టుచప్పుడు కాకుండా పని చేస్తున్న అక్రమ బంగారం కరిగించే కేంద్రాన్ని గుర్తించేందుకు దారి తీసింది. మొత్తం నలుగురు వ్యక్తులను అధికారులు అరెస్ట్ చేశారు.

అదే రోజున, మరో దాడిలో అధికారులు సైరంగ్ న్ నుంచి కోల్‌కతాకు రైలులో ప్రయాణిస్తున్న ఒక అనుమానిత మహిళను గుర్తించి ఆమె వద్ద నుంచి విదేశీ భాషా ముద్రలు కలిగిన సుమారు 3.3 కిలోల 20 విదేశీ బంగారు కడ్డీలను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన నడుము బెల్ట్‌లో ఈ బంగారాన్ని దాచి ఉంచిన ఆ ప్రయాణికురాలిని అధికారులు అరెస్ట్ చేశారు.

చెన్నైలో కూడా డొమెస్టిక్ ఎయిర్ కార్గో కన్సైన్‌మెంట్ల ద్వారా విదేశీ కరెన్సీని అక్రమంగా రవాణా చేస్తూ, ఆ సొమ్మును భారతదేశంలోకి వ్యవస్థీకృత పద్ధతిలో బంగారం, వెండి స్మగ్లింగ్ చేయడానికి ఉపయోగిస్తున్న ఒక పెద్ద స్మగ్లింగ్ రాకెట్‌ను డీఆర్ఐ విజయవంతంగా ఛేదించింది. చెన్నై ఎయిర్ కార్గో వద్ద కొన్ని కన్సైన్‌మెంట్లను అడ్డుకున్న డీఆర్ఐ అధికారులు.. వాటి నుంచి 7,58,500 అమెరికన్ డాలర్లు, 35,00,000 థాయ్ భట్ లతో కూడిన విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. దీని మొత్తం విలువ సుమారు రూ. 8.15 కోట్లుగా తేలింది. విదేశీ కరెన్సీని అక్రమంగా రవాణా, సరఫరా చేయడంలో భాగస్వాములైన ముగ్గురు వ్యక్తులను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విదేశీ కరెన్సీని వివిధ రహస్య మార్గాల ద్వారా భారతదేశం వెలుపలికి స్మగ్లింగ్ చేస్తున్నారని, ఆ సొమ్మును తిరిగి దేశంలోకి విలువైన లోహాల అక్రమ రవాణాకు పెట్టుబడిగా ఉపయోగిస్తున్నారని తదుపరి విచారణలో వెల్లడైంది.

ఈ దర్యాప్తులో భాగంగా, ఇటువంటి విదేశీ కరెన్సీ గ్రహీతలలో ఒకరిని దుబాయ్ నుంచి తిరిగి వస్తుండగా బెంగళూరు విమానాశ్రయంలో పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 1.8 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతని నివాసంలో జరిపిన తనిఖీల్లో సుమారు 42 కిలోల వెండి, 700 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 26.67 లక్షల భారతీయ కరెన్సీని కూడా స్వాధీనం చేసుకున్నారు. భారత్‌లో అక్రమంగా విదేశీ కరెన్సీ సేకరించడం, దానిని విదేశాలకు రహస్యంగా తరలించడం, అనంతరం బంగారం, వెండిని సంఘటిత ముఠాల ద్వారా తిరిగి దేశంలోకి అక్రమంగా రవాణా చేయడం - ఈ మూడు కార్యకలాపాల మధ్య ప్రత్యక్ష కార్యాచరణ సంబంధం ఉన్నట్లు ఈ కేసుతో స్పష్టమైంది.

ఈ మొత్తం దాడుల్లో సుమారు 9 కిలోల విదేశీ మార్కు ఉన్న స్మగ్లింగ్ బంగారం, 42 కిలోల వెండి, రూ. 8.15 కోట్ల విలువైన విదేశీ కరెన్సీతో పాటు రూ. 26.67 లక్షల భారతీయ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు ఎనిమిది మంది వ్యక్తులను అరెస్ట్ చేశారు.

# దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి పార్టీని బలోపేతం చేద్దాం..



అమరావతి, జులై 3:జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని, నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ జనసేన పార్టీ నిర్మాణ సారథుల పరిశీలకుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.

చిలకలూరిపేట పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జనసేన నియోజకవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

సమావేశానికి విచ్చేసిన బాలినేని శ్రీనివాసరెడ్డికి జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజీ ఆధ్వర్యంలో జనసైనికులు ఘన స్వాగతం పలికారు. నరసరావుపేట రోడ్డులోని ఫ్లైఓవర్ సెంటర్ వద్ద భారీ పూలమాలతో సత్కరించిన అనంతరం వందలాది బైక్‌లు, వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

ర్యాలీ సందర్భంగా జనసైనికులు "జై జనసేన", "పవన్ కళ్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు. బాణాసంచా పేలుళ్లు, డప్పు వాయిద్యాల నడుమ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సభలో బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, చిలకలూరిపేటలో జనసేన శ్రేణుల ఉత్సాహం పార్టీ విజయాన్ని గుర్తు చేస్తోందని అన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న అవాస్తవ ప్రచారాన్ని ప్రతి కార్యకర్త ప్రజల్లో సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. నాయకులు విభేదాలు పక్కనబెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజీ మాట్లాడుతూ, చిలకలూరిపేటలో జనసేన ఎల్లప్పుడూ ప్రజావక్షాన నిలుస్తుందని తెలిపారు. భారీ సంఖ్యలో తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేసిన జనసైనికులు, వీరమహిళలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలినేని శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు నియోజకవర్గంలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేస్తామని, అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. వైసీపీ నేతల అసత్య ప్రచారాలను తిప్పికొట్టడంలో చిలకలూరిపేట జనసేన శ్రేణులు ఎప్పుడూ ముందుంటాయని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# భీమ్‌గల్‌లో గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రారంభం..



నిజామాబాద్, జులై 3:నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ను కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ రాష్ట్ర చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ బి. నాగమణి స్వామి, బ్యాంక్ జీఎం ఎంవీజే శశికర్, ఏజీఎం తిరుపతి, బ్రాంచ్ మేనేజర్ సుమంత్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి బ్యాంకును ప్రారంభించారు.

అనంతరం నిర్వహించిన సమావేశంలో మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, భీమ్‌గల్ ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ బ్యాంకును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్యాంకు ఏర్పాటుకు అవసరమైన అన్ని సన్నాహాలు పూర్తయ్యాయని చెప్పారు.

తెలంగాణలోని కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో రూ.4,557.34 కోట్ల వ్యాపారంతో, 9.35 లక్షల మంది వినియోగదారులతో అగ్రగామిగా సంస్థ కొనసాగుతోందని తెలిపారు. భీమ్‌గల్ ప్రాంత ప్రజలకు రుణాలు, పొదుపు పథకాలు, డిపాజిట్ సేవలు, డిజిటల్ బ్యాంకింగ్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు.

చిన్న వ్యాపారులు, రైతులు, మహిళా సంఘాలు, యువ పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రాధాన్యతతో ఆర్థిక సేవలు అందిస్తామని చెప్పారు. బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ పర్ధ ఆనంద్‌రావు మాట్లాడుతూ, కేవలం రూ.1,000 షేర్ మొత్తంతో సభ్యత్వాన్ని ప్రారంభించవచ్చని తెలిపారు. ఎలాంటి హిడెన్ ఛార్జీలు లేకుండా పారదర్శక బ్యాంకింగ్ సేవలు అందించడమే బ్యాంకు లక్ష్యమని చెప్పారు.

రీజినల్ హెడ్ ఆర్.కె.వి. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ఆధార్ ఆధారిత నగదు లావాదేవీలు, ప్రభుత్వ సబ్సిడీలు, పెన్షన్ బదిలీలు, బంగారు ఆభరణాలపై రుణ సదుపాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

బ్రాంచ్ మేనేజర్ జక్క సుమన్ మాట్లాడుతూ, రైతులు, వ్యాపారులకు వివిధ తనఖాలపై రుణాలు అందజేస్తామని, సేవింగ్స్, కరెంట్ ఖాతాలను వెంటనే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రుణాలపై ఎలాంటి ప్రాసెసింగ్ ఛార్జీలు ఉండవని, డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు అందిస్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సంటి అలక నర్సయ్య, డైరెక్టర్లు ఆరేపల్లి శ్రీజ, మార్తాల లక్ష్మణ్, వర్ధ ఆనందరావు, పట్టణ అధ్యక్షుడు పర్స అనంతరావు, మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేంద్రబాబు, కౌన్సిలర్లు, సర్పంచులు, బ్యాంకు సిబ్బంది, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలించిన తహసీల్దార్ అశోక్ కుమార్

మహబూబ్‌నగర్, జులై 3: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను ఊట్కూర్ తహసీల్దార్ అశోక్ కుమార్ శుక్రవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రజలు కూడా అవసరమైన పత్రాలతో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బస్వరాజ్, పంచాయతీ కార్యదర్శి సుమన్ రెడ్డి, బి ఎల్ వో తదితరులు పాల్గొన్నారు.

# రైతుల విద్యుత్ సమస్యకు పరిష్కారం.. 100 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు

మహబూబ్‌నగర్, జులై 3:మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని బొక్కలోనిపల్లి గ్రామ రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి చొరవతో పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి 100 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారు.

చాలా రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుతో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోవింద్ యాదవ్, ఏఈ నర్సిరెడ్డి, విద్యుత్ శాఖ కాంట్రాక్టర్ సలీం, లైన్‌మ్యాన్ చెన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

# పత్తి రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ..



మహబూబ్‌నగర్, జులై 3:రాష్ట్ర ప్రభుత్వం పత్తి ఉత్పాదకతను పెంచే లక్ష్యంతో అమలు చేస్తున్న మిషన్ 2026-27 పథకం కింద రైతులకు సబ్సిడీపై పత్తి విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి గణేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డి. యగ్నేశ్వర్‌రెడ్డి తెలిపారు.

శుక్రవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ రైతు వేదిక భవనంలో రైతులకు సబ్సిడీ పత్తి విత్తనాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విత్తనాలతో సాగు చేపట్టాలని సూచించారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే పత్తి దిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయం తగ్గి రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని చెప్పారు.

వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సూచనలు అందిస్తూ పంటల నిర్వహణలో సహకరిస్తారని తెలిపారు. 250 ఎకరాల్లో సాళ్ల పద్ధతిలో పత్తి సాగు చేపట్టాలని రైతులకు సూచించారు.

ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సేవలను అందుబాటులోకి తీసుకొస్తోందన్నారు. రైతులు అధికారిక కేంద్రాల ద్వారానే విత్తనాలు కొనుగోలు చేసి రశీదులను భద్రపరచుకోవాలని, నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ కథలప్ప, ఉప సర్పంచ్ రమేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎం. భరత్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోరం మహేష్‌రెడ్డి, మైనారిటీ మండల అధ్యక్షుడు జలాల్, ఏఈవోలు, కాంగ్రెస్ కార్యకర్తలు కొక్కు శంకర్, రవికుమార్, చందు, రాఘవేందర్ గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాతి యుగం నాటి చిత్రాలు గుర్తింపు

ములుగు, జులై 3: ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని అడవుల్లో రాతి యుగం నాటి మానవాకృత, జంతువులు చిత్రాలు గుర్తించినట్లు పబ్లిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హిస్టరీ, ఆర్కియాలజీ అండ్ హెరిటేజ్ (ప్రీహా) బృందం గుర్తించింది. ఇటీవల ములుగు జిల్లా కేంద్రానికి 30 కి.మీటర్ల దూరంలోని అడవుల్లో గుట్టలను ప్రీహా జనరల్ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.ఎ.శ్రీనివాస్ నేతృత్వంలో సభ్యులు గడ్డం క్రాంతి కుమార్, తాటి సాంబశివరావు సందర్శించారు. వెంకటాపూర్ మండల పరిధిల్లోని మొద్దుగుట్ట, దర్వాజల గుట్ట, నెమలి గుట్టల్లోని బండ రాళ్లపై రాతి యుగం నాటి చిత్రాలను గుర్తించారు. మనుషులు, జింక, ఎద్దు, తాబేలు,నక్క, అడవీదున్న చిత్రాల ను గుర్తించినట్లు వారు పేర్కొ న్నారు. ఈ చిత్రాలు తెలుపు, ఎరుపు రంగుల్లో ఉన్నట్లు మీడియాకు వెల్లడించారు.

# చట్టబద్ధమైన రక్షణ కల్పించాలి



ములుగు, జులై 3: సమాజంలో లైంగిక దాడులకు గురైన మహిళలు, చిన్నారులకు చట్టబద్ధమైన రక్షన కల్పించాలని సీపీ శ్వేత అన్నారు. గురువారం కమిషనరేట్‌లో వరంగల్ జనగామ భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం బలోపేతం చేసేందుకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాధితుల గౌరవం, గోప్యత, అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రతి కేసును సున్నితంగా విచారించాలన్నారు. పోక్సో కేసుల్లో నిర్దేవిత గడువులోపు నిందితుల అరెస్టు, విచారణ పూర్తి చేసి కోర్టులో బలమైన సాక్ష్యాధారాలను సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు అవసరమైన వైద్య సమావేశంలో క్రైం డీసీప కిషన్‌సింగ్, అదనపు డీసీపీ బాలస్వామి, పాల్గొన్నారు.

# కానుకుంటలో మహిళా సంఘాలకు సోషల్ ఆడిట్

## మహిళల ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కల్పించిన అధికారులు

మెదక్, జులై 3:రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల పనితీరును మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన సోషల్ ఆడిట్ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో రాష్ట్రంలోనే తొలి పైలట్ సోషల్ ఆడిట్ విజయవంతంగా నిర్వహించారు. సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా సోషల్ ఆడిట్ చేపడుతున్నారు.

ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని గుమ్మడిదల, పటాన్‌చెరు మండలాలను ఎంపిక చేశారు. కానుకుంట-2 గ్రామైక్య సంఘం పరిధిలోని 34 మహిళా సంఘాలకు సోషల్ ఆడిట్ నిర్వహించి, సంఘాల పనితీరు, ఆర్థిక లావాదేవీలు, పొదుపులు, అంతర్గత రుణాల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. జూన్ 25 నుంచి జులై 1 వరకు కొనసాగిన ఈ సోషల్ ఆడిట్ అనంతరం మహిళా గ్రామసభ నిర్వహించి, ఆడిట్‌లో గుర్తించిన అంశాలను సంఘ సభ్యులకు అధికారులు వివరించారు.

ముఖ్యంగా అంతర్గత రుణాలకు సంబంధించి చాలా మంది సభ్యులు అసలు మొత్తాన్ని చెల్లించకుండా కేవలం వడ్డీలను మాత్రమే చెల్లిస్తున్నట్లు గుర్తించిన అధికారులు, దీనివల్ల కలిగే ఇబ్బందులను వివరించి అవగాహన కల్పించారు. దీనిపై స్పందించిన సంఘ సభ్యులు తమ రుణాల అసలు మొత్తాన్ని కూడా క్రమం తప్పకుండా విడతల వారీగా చెల్లిస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ ఉషారాణి మాట్లాడుతూ, కానుకుంట మహిళా సంఘాల పనితీరు ఆదర్శవంతంగా ఉందని ప్రశంసించారు.

సోషల్ ఆడిట్ ద్వారా మహిళా సంఘాల్లో పారదర్శకత, జవాబుదారీతనం, ఆర్థిక క్రమశిక్షణ మరింత పెంపొందుతాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి సీఆర్‌డీ డిప్యూటీ డైరెక్టర్ ఉషారాణి, రాష్ట్ర సెర్ప్ కార్యాలయానికి చెందిన జూనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ రాజేష్, జిల్లా డీపీఎం జాన్ కెనడీ, ఏపీఎం నరేందర్, సీసీ వరలక్ష్మి, వీఓఏ మహేశ్వరి, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు యశోద, పూజతో పాటు మహిళా సంఘాల సభ్యులు, సోషల్ ఆడిట్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గంజాయి విక్రేతల అరెస్టు..

## ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ బృందం దాడులు



నిజామాబాద్, జులై 3:నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలలో గంజాయి విక్రయిస్తున్నట్టుగా సమాచారం అందడంతో ఎన్ ఫోర్స్ మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం దాడులు నిర్వహించినట్లు ఎన్ ఫోర్స్ మెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాటాడారు. ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నగరంలోని పూలాంగ్ చౌరస్తా, బోధన్ బస్టాండ్ ఏరియాలో దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ఈ దాడుల్లో ఇందు గంజాయి విక్రయిస్తున్న షేక్ సమీర్, మమ్మద్ రిజ్వాన్ అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి గ్రా.200ల ఎండు గంజాయి, రెండు మొబైల్ ఫోన్ లు సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేసే రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడులలో ఎస్సై రామ్ కుమార్‌తో పాటు సిబ్బంది భూమన్న, విట్టల్, లక్ష్మీ నర్సయ్య ,శివకుమార్, సాయికుమార్, శ్యాంసుందర్, ప్రకాష్ పాల్గొన్నట్లు తెలిపారు.

## పీఎంజీకేఏవై కింద మరింత నాణ్యమైన బియ్యం పంపిణీకి ప్రభుత్వ ఆమోదం...

# 80 కోట్లకు పైగా లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం

న్యూఢిల్లీ, జులై 3:ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై)తోపాటు ఇతర సంక్షేమ పథకాల కింద పంపిణీ చేసే బియ్యం నాణ్యతను మరింత మెరుగుపరచడం కోసం... ఒక చరిత్రాత్మక సంస్కరణకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదం తెలిపింది.

ప్రజా పంపిణీ వ్యవస్థ కింద సరఫరా చేసే బియ్యం నాణ్యత ప్రమాణాలను ప్రభుత్వం సవరించడం దాదాపుగా గత మూడు దశాబ్దాల్లో ఇదే మొదటిసారి. లబ్ధిదారులకు ప్రస్తుతం అందుతున్న రేషన్ కోటాలో ఎలాంటి మార్పులు చేయకుండానే... బియ్యంలో నూకల శాతం గణనీయంగా తగ్గేలా, అత్యంత నాణ్యమైన బియ్యాన్ని అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఆమోదించిన విధానం కింద:

పీఎంజీకేఏవై కింద పంపిణీ చేసే ముడి బియ్యంలో నూకల శాతం 10 శాతం వరకు ఉండవచ్చు. ఇంతకు ముందున్న 25 శాతం పరిమితి స్థానంలో ఇది అమలవుతుంది.

ఉప్పుడు బియ్యంలో 5 శాతం వరకు నూక బియ్యం ఉండవచ్చు. ఇంతకు ముందున్న 16 శాతం పరిమితి స్థానంలో ఇది అమలవుతుంది.

మెరుగైన నాణ్యత కలిగిన బియ్యం సేకరణ ప్రక్రియ తక్షణమే ప్రారంభమవుతుంది. ఈ విధానాన్ని బియ్యం సేకరించే అన్ని రాష్ట్రాల్లో... 2027-28 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ నాటికి దశలవారీగా పూర్తిగా అందుబాటులోకి తీసుకొస్తారు.

పీఎంజీకేఏవైతోపాటు ఇతర సంక్షేమ పథకాల కింద ఈ మెరుగైన నాణ్యమైన బియ్యం పంపిణీని కూడా దశలవారీగా చేపట్టనున్నారు. దీనివల్ల అన్ని రాష్ట్రాల్లోనూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సవరించిన కొత్త ప్రమాణాల ప్రకారం పంపిణీ ప్రక్రియ సజావుగా సాగడానికి వీలవుతుంది.

**లబ్ధిదారులకు మరింత నాణ్యమైన బియ్యం**

ఆహార భద్రతను కల్పించడమే కాకుండా పీఎంజీకేఏవై, ఇతర సంక్షేమ పథకాల పరిధిలోని 80 కోట్లకు పైగా లబ్ధిదారులకు నాణ్యమైన ఆహార ధాన్యాలను అందించాలన్న ప్రభుత్వ నిబద్ధతను ఈ నిర్ణయం ప్రతిబింబిస్తోంది. లబ్ధిదారులు తమకు వచ్చే రేషన్ కోటాలో ఎలాంటి కోత లేకుండానే.. గింజల నాణ్యత మెరుగ్గా ఉండే, చూడడానికి బాగుండే, వినియోగదారులకు ఆమోదయోగ్యమైన నాణ్యమైన బియ్యాన్ని పొందనున్నారు.

**నూకల సద్వినియోగం**

సవరించిన నిబంధనల ప్రకారం.. మిల్లింగ్ సమయంలో వచ్చే నూకలను వేరు చేసి, ఇతర ప్రయోజనాల కోసం సద్వినియోగం చేసుకోవచ్చు. దీనివల్ల పీఎంజీకేఏవై లబ్ధిదారులకు నాణ్యమైన తినదగిన బియ్యం అందుతుంది.

**ఆర్థిక, నిర్వహణ ప్రయోజనాలు**

ఈ సంస్కరణ వల్ల రవాణా, నిల్వ, నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఎందుకంటే మిల్లుల్లో వేరు చేసిన నూకలను నేరుగా ఆయా మిల్లుల ఆవరణ నుంచే వేలం వేస్తారు. నూకలను నిల్వ చేయడానికి హెచ్‌డీపీఈ సంచులను ఉపయోగించడం వల్ల గోనె సంచుల అవసరం కూడా తగ్గుతుంది. దీనివల్ల రవాణా, నిల్వ, ప్యాకేజింగ్ ఖర్చులు తగ్గి.. ఏడాదికి దాదాపు రూ. 2,161 కోట్లు ఆదా అవుతాయని అంచనా. అంతేకాకుండా నూకల విక్రయం ద్వారా ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరుతుంది. ఇది ఆహార సబ్సిడీ భారాన్ని మరింత తగ్గించడానికి దోహదపడుతుంది.

**ప్రయోగాత్మక అమలు**

హర్యానా, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ వంటి పలు రాష్ట్రాల్లో ఇప్పటికే చేపట్టిన ప్రయోగాత్మక అమలు ద్వారా ఈ ప్రతిపాదన విజయవంతంగా నిరూపితమైంది. మెరుగైన నాణ్యత గల బియ్యాన్ని భారీ స్థాయిలో ఉత్పత్తి చేయడం సాధ్యమేనని ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు నిరూపించింది. కేంద్ర కేబినెట్ ఆమోదం నేపథ్యంలో.. ఈ ప్రయోగాత్మక దశలో ఉత్పత్తి చేసిన మెరుగైన నాణ్యత గల బియ్యాన్ని పీఎంజీకేఏవై, ఇతర సంక్షేమ పథకాల లబ్ధిదారులకు కూడా సరఫరా చేయనున్నారు.

**మెరుగైన పారదర్శకత**

ఈ సంస్కరణల్లో భాగంగా బియ్యం బస్తాలకు క్యూఆర్ కోడ్ ట్యాగింగ్ చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల మిల్లుల నుంచి రేషన్ దుకాణాల వరకు సరఫరా వ్యవస్థలోని ప్రతి దశలోనూ పారదర్శకంగా పర్యవేక్షణకు వీలవుతుంది. ఫలితంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెరగడం తోపాటు.. సరుకు నిల్వల నిర్వహణ సులువవుతుంది. రేషన్ బియ్యం పక్కదారి పట్టే అవకాశాలకు అడ్డుకట్ట పడుతుంది.

అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం ఆహార భద్రతను అందించింది. మెరుగైన నాణ్యతతో కూడిన ఆహార భద్రతను సాధించడమే తదుపరి లక్ష్యం. ఈ చరిత్రాత్మక నిర్ణయం వల్ల పేద కుటుంబాలు ఆత్మగౌరవంతో, అత్యంత నాణ్యమైన బియ్యాన్ని పొందేందుకు వీలవుతుంది. అలాగే ఆహార ధాన్యాల నిర్వహణలో సమర్థత, పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ మెరుగుపడతాయి.

# లారీ అసోసియేషన్‌కు టెండర్లలో ప్రాధాన్యం కల్పిస్తాం

## –భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



వరంగల్, జులై 3: ది కాకతీయ లారీ ఓనర్స్ , వెల్ఫేర్ అసోసియేషన్ భూపాలపల్లికి సింగరేణి, సివిల్ సప్లై, బొగ్గు రవాణా టెండర్లలో ప్రాధాన్యం దక్కేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హామీ ఇచ్చారు. శుక్రవారం జరిగిన లారీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పులి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి బొంతల రాజు, ఉపాధ్యక్షుడు కౌటాం సురేందర్, సహాయ కార్యదర్శి మేకల శ్రావణ్, కోశాధికారి చిత్తారి రాకేష్‌లను అభినందించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులు ఐక్యంగా ఉండి దరఖాస్తులు సమర్పిస్తే సింగరేణి, కొత్తగూడెం తదితర సంస్థల అధికారులతో మాట్లాడి టెండర్లు వచ్చేలా కృషి చేస్తానన్నారు. సివిల్ సప్లై, బొగ్గు రవాణా పనులు దళారుల చేతుల్లోకి వెళ్లకుండా స్థానిక లారీ యజమానులకే దక్కేలా ప్రభుత్వ స్థాయిలో ప్రయత్నిస్తానని చెప్పారు.

అసోసియేషన్ ఆర్థికంగా బలోపేతం కావడమే తన లక్ష్యమని, టెండర్ల ద్వారా వచ్చే అవకాశాలు 300 మంది సభ్యులకు సమానంగా ప్రయోజనం చేకూరేలా కార్యవర్గం చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు.

భూపాలపల్లిలో ఆటోనగర్ ఏర్పాటు, లారీ అసోసియేషన్‌కు అవసరమైన స్థలం, ఫెన్సింగ్, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సింగరేణి అధికారులతో చర్చిస్తానన్నారు. అలాగే కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్‌తో సమావేశం నిర్వహించి ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, పట్టణ అభివృద్ధికి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

ప్రభుత్వ సహకారంతో భూపాలపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, ప్రజల ఆశీర్వాదంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, డిసిసి అధ్యక్షులు బట్టు కరుణాకర్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, లారీ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు వెండితెర చక్రవర్తికి ఏలూరులో అశ్రు నివాళి

న్యూ ఢిల్లీ, జులై 3: తెలుగు సినీ చరిత్రలో తనదైన ముద్ర వేసిన విశ్వ నట చక్రవర్తి ఎస్వీ రంగారావు 108వ జయంతి వేడుకలు శుక్రవారం నాడు ఏలూరులో అత్యంత ఘనంగా జరిగాయి. మేనమామ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) భావోద్వేగానికి గురయ్యారు. పవర్‌పేటలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి, ఎస్వీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల మౌనం పాటించారు. తాత జయంతిలో పాల్గొన్న ఎస్వీ రంగారావు మనవడు ఎన్ఎల్‌వీఎన్ రంగారావు మాట్లాడుతూ, “మా తాతగారు ఏలూరు బిడ్డగా పుట్టి ప్రపంచ సినిమాకే వన్నె తెచ్చారు.

మా కుటుంబంపై ఏలూరు ప్రజలు చూపిస్తున్న అభిమానం మరువలేనిది” అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ రావణబ్రహ్మ, ఘటోత్కచుడు, కీచకుడు? పాత్ర ఏదైనా అందులో జీవించిన ఏకైక నటుడు మా మేనమామ. ‘మాయాబజార్’లో ఆయన ఘటోత్కచుడు లేకపోతే ఆ సినిమాకే వెలితి. నంది అవార్డులు, రాష్ట్రపతి పురస్కారాలు వచ్చినా ఏలూరు వీధుల్లో సాదాసీదాగా తిరిగిన గొప్ప మనిషి. ఆయన వారసుడిగా పుట్టడం నా అదృష్టం” అంటూ బడేటి చంటి ఉద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, సెక్రటరీ రెడ్డి నాగరాజు, బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ లంకపల్లి మాణిక్యాలరావు, క్లస్టర్ ఇంచార్జ్ మల్లెపు రాము, సీనియర్ నాయకులు ఆర్నేపల్లి తిరుపతిరావు, కందుల రమేష్ సహా పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు, అభిమానులు హాజరయ్యారు.

# జీవో ఎంఎస్ నెంబర్ 396ను రద్దు చేయాలి

## –ఇబ్రహీంపట్నంలో దస్తావేజు లేఖరుల ధర్నా



అమరావతి, జులై 3: రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ప్రైవేటీకరణను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని దస్తావేజు లేఖరులు డిమాండ్ చేశారు. జీవో ఎంఎస్ నెంబర్ 396ను రద్దు చేయాలని కోరుతూ జిల్లా దస్తావేజు లేఖరుల వృత్తి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరులు మాట్లాడుతూ ప్రభుత్వ చర్యల వల్ల దస్తావేజు లేఖరుల వృత్తి ప్రమాదంలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దస్తావేజు లేఖరుల లైసెన్సులను పునరుద్ధరించాలని, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును ఆపాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలని కోరారు. దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్ల జీవనోపాధిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండలంలోని దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# పోటీ పరీక్షల దరఖాస్తుల డిజిటల్ పరిశీలన వల్ల మానవ జోక్యం లేకుండా ప్రక్రియ మరింత పారదర్శకం

న్యూఢిల్లీ, జులై 3:డిజిటల్ ఇండియా కార్యక్రమం 1 జూలై 2026 నాటికి పదకొండు సంవత్సరాలు పూర్తి చేసుకోగా, పాలనను మరింత పారదర్శకంగా, అందుబాటులో ఉండేలా, ప్రజా ప్రాధాన్య కేంద్రితంగా మార్చేందుకు భారత్ తన డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను నిరంతరం బలోపేతం చేస్తోంది. 2015లో ప్రారంభమైనప్పటి నుంచి డిజిటల్ ఇండియా విద్యా రంగంతో సహా వివిధ రంగాలలో ప్రభుత్వ సేవలను అందించే ప్రక్రియను పూర్తిగా మార్చివేసింది. నమ్మకమైన డిజిటల్ వేదికల ద్వారా ప్రజల జీవన విధానాన్ని సులభతరం చేస్తూ సమర్థవంతమైన పాలనను పెంపొందిస్తోంది.

విద్యా రంగంలో డిజిటల్ ఇండియా కార్యక్రమం జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020కి అనుగుణంగా నిరంతర అభ్యాసం, విద్యాపరమైన చలనశీలత, సురక్షితమైన డిజిటల్ ధృవపత్రాలను ప్రోత్సహించే డిజిటల్ వేదికల అభివృద్ధికి ఎంతో తోడ్పాటునందించింది. ఈ విప్లవాత్మక మార్పుకు చోదక శక్తులుగా నిలిచిన కీలకమైన కార్యక్రమాలలో ‘అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ), నేషనల్ అకడమిక్ డిపాజిటరీ (ఎన్ఎడి) ప్రధానమైనవి.

అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్: సౌకర్యవంతమైన అభ్యాసానికి వెసులుబాటు

విశ్వవిద్యాలయ నిధుల సంఘం (యూజీసీ) నియంత్రణ, విద్యా మంత్రిత్వ శాఖ చొరవతో రూపొందించిన అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ) గుర్తింపు పొందిన ఉన్నత విద్యా సంస్థల నుంచి విద్యార్థులు పొందిన విద్యా క్రెడిట్లను నిల్వ చేయడానికీ, బదిలీ చేయడానికీ, రీడీమ్ చేయడానికీ ఉపయోగపడే ఒక డిజిటల్ వేదిక. ఇది మల్టిపుల్ ఎంట్రీ – మల్టిపుల్ ఎగ్జిట్ (ఎమ్ ఈఎమ్ఈ), క్రెడిట్ బదిలీ, సౌకర్యవంతమైన అభ్యాస మార్గాలను అనుమతించడం ద్వారా జాతీయ విద్యా విధానం 2020కీ. నేషనల్ క్రెడిట్ విధానానికీ మద్దతు ఇస్తుంది.

ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (ఏపీఏఏఆర్) తో అనుసంధానించిన ఏబీసీ ప్రతి అభ్యాసకుడికీ ఒక ప్రత్యేకమైన జీవితకాల విద్యా గుర్తింపును అందిస్తుంది, ఇది ఒకే డిజిటల్ వేదిక ద్వారా పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, ఇతర గుర్తింపు పొందిన అభ్యాస కార్యక్రమాలలో విద్యా రికార్డులను సురక్షితంగా పొందే వీలు కల్పిస్తుంది.

తాజా పురోగతి ప్రకారం, 2,963 ఉన్నత విద్యా సంస్థలు ఏబీసీ వేదికలో నమోదు చేసుకున్నాయి. 26.29 కోట్లకు పైగా అపార్ (ఏపీఏఏఆర్) ఐడీలను నమోదు చేశారు. 110.65 కోట్లకు పైగా విద్యా రికార్డులను అప్‌లోడ్ చేశారు. ఇది దేశవ్యాప్తంగా డిజిటల్ విద్యా వ్యవస్థ పెరుగుతున్న వినియోగాన్ని ప్రతిబింబిస్తోంది.ఏబీసీ భౌతిక పత్రాల స్థానంలో సురక్షితమైన డిజిటల్ రికార్డులను ప్రవేశపెట్టడం ద్వారా విద్యా పరిపాలనను సరళీకృతం చేస్తోంది. దీనివల్ల విద్యార్థులు తమ విద్యా క్రెడిట్లను ఆన్‌లైన్‌లో పొందడానికి, బదిలీ చేయడానికి, రీడీమ్ చేయడానికి వీలవుతుంది. ఇది ప్రవేశాలు, స్కాలర్‌షిప్‌లు, ఇంటర్న్‌షిప్‌లు, ఉపాధి కోసం విద్యార్హతల వేగవంతమైన ధృవీకరణను కూడా సులభతరం చేస్తుంది. కాగితపు పనిని తగ్గించడంతో పాటు పారదర్శకతను, నమ్మకాన్ని పెంపొందిస్తుంది.

నేషనల్ అకడమిక్ డిపాజిటరీ (ఎన్ఏడీ) విద్యా పురస్కారాల 24x7 ఆన్‌లైన్ వేదిక. ఇది విద్యా సంస్థలు విద్యా ధృవీకరణ పత్రాలు, డిగ్రీలు, డిప్లొమాలు, మార్కుల జాబితాలను సురక్షితమైన డిజిటల్ రూపంలో జారీ చేయడానికి, భద్రపరచడానికి, ధృవీకరించడానికి వీలు కల్పిస్తుంది. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసిన ఎన్ఏడి అభ్యాసకులకు ఎప్పుడైనా, ఎక్కడైనా ధృవీకరించిన విద్యా రికార్డులను పొందే అవకాశాన్ని కల్పిస్తుంది. విద్యా సంస్థలు, యజమానులు, ప్రభుత్వ సంస్థలు విద్యార్హతలను డిజిటల్ రూపంలో ధృవీకరించుకోవడానికి అనుమతిస్తుంది.

భౌతిక ధృవీకరణ పత్రాల స్థానంలో డిజిటల్ రూపంలో ధృవీకరించిన రికార్డులను ప్రవేశపెట్టడం ద్వారా ఎన్ఏడీ పరిపాలన ఖర్చులను తగ్గిస్తుంది, కాగితపు పనిని తగ్గిస్తుంది. విద్యా పత్రాలు పోగొట్టుకునే లేదా దెబ్బతినే ప్రమాదాన్ని నివారిస్తుంది. సురక్షితమైన ఆన్‌లైన్ ధృవీకరణ వల్ల నకిలీ ధృవీకరణ పత్రాల వినియోగాన్ని అరికట్టడంలో సహాయపడటంతో పాటు ప్రవేశాలు, నియామకాలు, స్కాలర్‌షిప్‌లు, ఇతర ప్రజా సేవల్లో పారదర్శకతను, సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది.

ఏబీసీ, ఏపీఏఏఆర్, ఎన్ఏడీ ముఖ్య ప్రయోజనాలు

అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ), ఏపీఏఏఆర్, నేషనల్ అకడమిక్ డిపాజిటరీ (ఎన్ఏడీ) కలిసి భారత డిజిటల్ విద్యా వ్యవస్థను ఈ క్రింది విధాలుగా బలోపేతం చేస్తున్నాయి:

సురక్షితమైన డిజిటల్ విద్యా రికార్డులను అందించడం, భౌతిక ధృవీకరణ పత్రాలపై ఆధారపడటాన్ని తగ్గించడం పత్రాలు పోగొట్టుకోవడం/దెబ్బతినడం/ నకిలీల తయారీ ప్రమాదాన్ని నివారించడం.

సమన్వయం చేసిన డిజిటల్ వేదికల ద్వారా విద్యా క్రెడిట్లు, ధృవీకరణ పత్రాలు మార్కుల జాబితాలను ఎప్పుడైనా, ఎక్కడైనా పొందే వీలు కల్పించడం.

ఎన్ ఈ పి 2020కి అనుగుణంగా విద్యా క్రెడిట్ బదిలీ, మల్టిపుల్ ఎంట్రీ-మల్టిపుల్ ఎగ్జిట్ (ఎమ్ఈఎమ్ఈ)ని సులభతరం చేయడం ద్వారా సౌకర్యవంతమైన అభ్యాసానికి మద్దతు ఇవ్వడం.

విద్యా సంస్థలు, యజమానులు, ప్రభుత్వ సంస్థల ద్వారా విద్యార్హతల వేగవంతమైన డిజిటల్ ధృవీకరణతో ప్రవేశాలు, స్కాలర్‌షిప్‌లు, ఉపాధి ప్రక్రియలను వేగవంతం చేయడం.

మాన్యువల్ ధృవీకరణ, పదేపదే సమర్పించే పత్రాల స్థానంలో ధృవీకరించిన డిజిటల్ రికార్డులను ప్రవేశపెట్టడం ద్వారా కాగితాల పనిని, పరిపాలనా భారాన్ని తగ్గించడం.

డిజిలాకర్, ఇతర డిజిటల్ ఇండియా కార్యక్రమాలతో అనుసంధానం చేయడం ద్వారా డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, విద్యా రికార్డుల సురక్షిత మార్పిడి, పరస్పర కార్యకలాపాలకు వీలు కల్పించడం.

ఎ పి ఏఏఆర్ ఐడీ ధృవీకరణ ప్రక్రియను సరళీకృతం చేసిందని, కాగితపు పనిని గణనీయంగా తగ్గించిందని ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్ రుంగ్టా ఇంటర్నేషనల్ స్కిల్స్ యూనివర్సిటీ ఎమ్బీఏ విద్యార్థిని అంజలి రాథోడ్ అన్నారు. సదస్సులు, పోటీలు, ఇంటర్న్‌షిప్‌లు, స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవడాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చడం వల్ల తనకు అవసరమైనప్పుడల్లా తన విద్యా ఆధారాలను సులభంగా పొందగలుగుతున్నానని ఆమె చెప్పారు. ఈ డిజిటల్ వ్యవస్థ సమయాన్ని, శ్రమను ఆదా చేసింది. ఇది ఆధునికమైనదిగా, నమ్మదగినదిగా, విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని నిరూపితమైందని పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్‌లో గల గవర్నమెంట్ వీవైటి పీజీ పఅటానమస్ కాలేజ్ విద్యార్థి ఆశిష్ తివాంగన్ మాట్లాడుతూ, ఏపీఏఏఆర్ ఐడీ తన విద్యా విషయాల నిర్వహణను చాలా సులభతరం చేసిందని అన్నారు. తన మార్కుల జాబితాలు, ధృవీకరణ పత్రాలు, విద్యా రికార్డులు ఇప్పుడు డిజిటల్ రూపంలో సురక్షితంగా ఉన్నాయని, అవసరమైనప్పుడల్లా వాటిని సులభంగా పొందవచ్చని ఆయన చెప్పారు. భవిష్యత్తు ప్రవేశాల కోసం ఏపీఏఏఆర్ ఐడీ విద్యా క్రెడిట్ బదిలీకి మద్దతు ఇస్తుందని, స్కాలర్‌షిప్ ధృవీకరణను సరళీకృతం చేస్తుందని కూడా ఆయన చెప్పారు. ఈ చొరవ విద్యార్థుల పర్యావరణ వ్యవస్థను మరింత సున్నితంగా, సులభతరంగా కాగిత రహితంగా మార్చిందని, ఇది విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తుందని అన్నారు.

ఏబీసీ, ఎన్ఏడీ, ఏపీఏఏఆర్, డిజిలాకర్‌ల అనుసంధానం విద్యా రికార్డుల సురక్షిత నిల్వ, నిరంతర మార్పిడి, డిజిటల్ ధృవీకరణకు వీలు కల్పించే ఒక ఉమ్మడి డిజిటల్ విద్యా వ్యవస్థను సృష్టించింది. ఈ చొరవలన్నీ కలిసి విద్యా సంస్థల మధ్య పరస్పర కార్యకలాపాలను ప్రోత్సహిస్తాయి. విద్యాపరమైన రాకపోకలకు మద్దతు ఇస్తాయి. ఎన్ఈపి 2020 లక్ష్యాలకు అనుగుణంగా నిరంతర అభ్యాస ప్రక్రియను సులభతరం చేస్తాయి.

గడచిన పదకొండేళ్లలో, డిజిటల్ ఇండియా విద్యా రికార్డులను సురక్షితంగా, సులభంగా బదిలీ చేసుకునేలా, డిజిటల్ రూపంలో ధృవీకరించుకునేలా చేయడం ద్వారా విద్యా సేవల లభ్యతను పూర్తిగా మార్చివేసింది. ఏబీసీ, ఎన్ఏడి వంటి కార్యక్రమాల ద్వారా, ప్రభుత్వం కాగిత రహిత పరిపాలనను ముందుకు తీసుకెళ్తోంది. పరిపాలనా భారాన్ని తగ్గిస్తోంది. వికసిత భారత్ సంకల్పానికి మద్దతుగా నిలిచే నమ్మకమైన, ప్రజా ప్రాధాన్య కేంద్రీకృత డిజిటల్ విద్యా వ్యవస్థను నిర్మిస్తోంది.

# నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ద్వారా ప్రపంచ గ్రీన్ హైడ్రోజన్ రంగ నాయకత్వం దిశగా పురోగమిస్తున్న భారత్



న్యూ ఢిల్లీ, జులై 3:నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ద్వారా భారత్ కీలక ముందడుగు వేసింది. న్యూఢిల్లీలోని అటల్ అక్షయ్ ఊర్జా భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ రోజు ప్రముఖ జపనీస్ కంపెనీలైన ఐహెచ్ఐ కార్పొరేషన్ ఫర్ గ్రీన్ అమోనియా, మిత్సుబిషి గ్యాస్ కెమికల్ కంపెనీ ఫర్ గ్రీన్ మిథనాల్ సంస్థలతో ఏసీఎంఈ క్లీన్‌టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏసీఎంఈ గ్రూప్) దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంది.

నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ జనవరి 2023లో రూ.19,744 కోట్ల వ్యయంతో ఏర్పాటైంది. గ్రీన్ హైడ్రోజన్, దాని ఉత్పన్నాల ఉత్పత్తి, వినియోగం, ఎగుమతుల్లో భారత్‌ను ప్రపంచ కేంద్రంగా నిలపడం లక్ష్యంగా ఇది పనిచేస్తోంది. ఈ మిషన్ కింద, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) నిర్వహించే పారదర్శక బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఉత్పత్తికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని స్ట్రాటజిక్ ఇంటర్వెన్షన్స్ ఫర్ గ్రీన్ హైడ్రోజన్ ట్రాన్సిషన్ (సైట్) కార్యక్రమం అందిస్తోంది. సైట్ కార్యక్రమం కింద, ఏసీఎంఈ గ్రూప్ కోసం సంవత్సరానికి 3,70,000 టన్నుల (370 కేటీపీఏ) ఉత్పత్తి సామర్థ్యాన్ని కేటాయించారు. ఇది ఈ ఎగుమతి-ఆధారిత ఒప్పందాలకు పునాది వేసింది.

ఐహెచ్ఐ కార్పొరేషన్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం... ఏసీఎంఈ సంవత్సరానికి మొత్తం 4,05,000 టన్నుల (405 కేటీపీఏల) గ్రీన్ అమ్మోనియాను సరఫరా చేస్తుంది. ఎమ్ఈటీఐ నిర్వహణలోని... ‘తక్కువ-కార్బన్ గల అమ్మోనియా కోసం జపాన్స్ కాంట్రాక్ట్ ఫర్ డిఫరెన్స్ (సీఎఫ్‌డీ) పథకం’ ఈ ఏర్పాటు కోసం మద్దతునిస్తుంది. ఇది జపనీస్ కొనుగోలుదారులకు ధర పరంగా మద్దతునందించడం ద్వారా అటువంటి దిగుమతుల దీర్ఘకాలిక వాణిజ్యానికి అవకాశాలను నిర్ధారిస్తుంది.

పారాదీప్ ప్లాంట్ నుంచి ఏసీఎంఈ సంస్థ 10 సంవత్సరాల పాటు సంవత్సరానికి 1,00,000 టన్నుల (100 కేటీపీఏ) గ్రీన్ మిథనాల్ సరఫరా చేయడం కోసం మిత్సుబిషి గ్యాస్ కెమికల్ కంపెనీతో ఒప్పందం చేసుకుంది. ఈ ప్రాజెక్టు ముఖ్యంగా సముద్ర రంగంలో ప్రపంచ డీకార్బనైజేషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. యూరోపియన్ రిన్యూయెబుల్ ఫ్యూయల్స్ ఆఫ్ నాన్-బయోలాజికల్ ఆరిజిన్ అవసరాలకూ, సముద్ర సంబంధ పరిశుద్ధ ఇంధనాల కోసం ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ ప్రమాణాలకూ అనుగుణంగా దీనిని రూపొందించారు.

”ఏసీఎంఈ-ఐహెచ్ఐ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు కోసం సీఎఫ్‌డీ ద్వారా అందిస్తున్న రాయితీ మద్దతును పొడిగించాలని జపాన్ తీసుకున్న నిర్ణయాన్ని నేను స్వాగతిస్తున్నా. భారత గ్రీన్ హైడ్రోజన్ వ్యవస్థ పట్ల ప్రపంచానికి పెరుగుతున్న విశ్వాసాన్ని, ప్రపంచ పరిశుద్ధ ఇంధన పరివర్తనలో విశ్వసనీయ భాగస్వామిగా మన పురోగతిని ఇది ప్రతిబింబిస్తోంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో... నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ఒక పటిష్ఠమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న వ్యవస్థను సృష్టిస్తోంది. ఇది ప్రపంచ పెట్టుబడులను ఆకర్షిస్తూ, అంతర్జాతీయ భాగస్వామ్యాలను నిర్మిస్తూ, భారతీయ గ్రీన్ హైడ్రోజన్, దాని ఉత్పన్నాలకు కొత్త మార్కెట్లనూ అందుబాటులోకి తెస్తోంది,” అని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధనం, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం-ప్రజా పంపిణీ శాఖల మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి అన్నారు.

ఈ సందర్భంగా నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సంతోష్ కుమార్ సారంగి మాట్లాడుతూ, మిషన్ దృక్కోణంలో ఈ ఒప్పందాలు మూడు కీలక ఫలితాలను అందించాయని అన్నారు. అవి గ్రీన్ అమోనియా, గ్రీన్ మిథనాల్ కోసం జపాన్‌తో మార్కెట్ అనుసంధానాన్ని ఏర్పరచి పెట్టుబడిదారులకు విశ్వాసాన్ని కలిగించడం... భారతీయ పరిశుద్ధ ఇంధనాలు ఇప్పుడు ప్రపంచ మార్కెట్‌కు విశ్వసనీయ సరఫరాదారుగా నిలవడం ద్వారా గ్రీన్ హైడ్రోజన్ రంగం వాణిజ్యపరంగా పురోగతి సాధిస్తున్నదని చాటడం... అంతర్జాతీయ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ఉత్పత్తి, సరఫరాల కోసం సమర్థమైన వ్యవస్థను సృష్టించడం అని శ్రీ సంతోష్ కుమార్ వివరించారు.

ఈ కార్యక్రమంలో జపాన్ ప్రభుత్వ ఎమ్ఈటీఐ ఉప మంత్రి శ్రీ టకేహికో మత్సువో ప్రసంగిస్తూ, పరిశుద్ధ ఇంధన రంగంలో భారత్-జపాన్ సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడంలో ఈ ఒప్పందం కీలకమైనదని పేర్కొన్నారు.

భారత్ నుంచి జపాన్‌కు ఇప్పటి వరకు జరిగిన అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా, మిథనాల్ సరఫరా ఒప్పందాల్లో ఒకటిగా ఈ ఒప్పందం నిలుస్తుంది. ఇది పెరుగుతున్న భారత గ్రీన్ హైడ్రోజన్ వ్యవస్థ వాణిజ్య పురోగతిని స్పష్టం చేయడమే కాకుండా, సైట్ కార్యక్రమం కింద స్థాపించిన ఉత్పత్తి సామర్థ్యాల దీర్ఘకాలిక డిమాండ్‌నూ బలపరుస్తుంది. భారత్ నుంచి తక్కువ కర్బన ఉద్గారాలు గల ఇంధనాల నిరంతర సరఫరాను నిర్ధారించడం ద్వారా ఈ భాగస్వామ్యాలు... జపాన్ ఇంధన పరివర్తన, ఇంధన భద్రతా లక్ష్యాలకూ దోహదం చేస్తాయి.

# బ్రిటిషర్ల గుండెల్లోకి దూసుకుపోయిన విప్లవ బాణం అల్లూరి..

## జూలై 4... విప్లవ వీరుని జయంతి



విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు గురించి తెలియని వారుండరు. మన్యం ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసి, వారి కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుడైన అల్లూరి, అక్కడి ప్రజలకు దైవ సమానుడై,

భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడుగా, మన్యం వీరుడుగా, అగ్గి పిడుగుగా ప్రసిద్ధి గాంచిన పోరాట యోధుడు సీతారామ రాజు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి. ఆయన

ఒక మహోజ్వల శక్తి. ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడు. కేవలం 27 ఏళ్ళ వయసులోనే నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులు అయిన అనుచరులతో, చాలా పరిమిత వనరులతో బ్రిటీషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడు.

రెండేళ్ల పాటు బ్రిటిషర్లకు కంటిమీద కనుకులేకుండా చేసిన సీతారామరాజు.. తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేశాడు.

సీతారామరాజు జన్మదినం 1897 జూలై 4.. హేవళంబి నామ సంవత్సరం, ఆషాఢ మాసం, శుద్ధ పంచమి – 23 ఘడియల 30 విఘడియలు. (సాయంకాల 4 గంటలకు) మఖా నక్షత్రయుక్త వృశ్చిక లగ్నం. వారి స్వగ్రామం ఇప్పటి పశ్చిమ గోదావరి జిల్లాలోని మోగల్లు ,అయినా విజయనగరం దగ్గరి పాండ్రంగిలో తాతగారైన (మాతామహుడు) మందలపాటి శ్రీరామరాజు ఇంట రాజు జన్మించాడు. అయితే పెరిగింది మాత్రం పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లులో. రామరాజు తండ్రి వెంకట రామరాజు, తల్లి సూర్యనారాయణమ్మ. 9వ తరగతి వరకు చదివిన అల్లూరి.. సంస్కృతం, జోతిష్యశాస్త్రం, జాతక శాస్త్రం, విలువిద్య, గుర్రపు స్వారీలో ప్రావీణ్యం పొందారు.

1917లో విశాఖపట్నం జిల్లా క్రిష్ణదేవీపేట ద్వారా మన్యంలోకి అడుగుపెట్టారు.

రాజు కుటుంబం 1918 వరకు తునిలోనే ఉంది. ఆ కాలంలోనే చుట్టుపక్కలగల కొండలు, అడవులలో తిరుగుతూ, గిరిజనుల జీవన విధానాన్ని గమనిస్తూ ఉండేవాడు. ధారకొండ, కృష్ణదేవీ పేట మొదలైన ప్రాంతాలు ఈ సమయంలో చూసాడు. వత్సవాయి నీలాద్రిరాజు వద్ద జ్యోతిష్యం, వాస్తు శాస్త్రం, హఠయోగం, కవిత్వం నేర్చుకున్నాడు. సూరి అబ్బయ్యశాస్త్రి వద్ద సంస్కృతం, ఆయుర్వేదం నేర్చుకున్నాడు.

మన్యం ప్రజల దీన స్థితిగతులను పరిశీలించి, బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా విప్లవానికి సిద్ధం కావాలని మన్యం ప్రజలను పురిగొల్పాడు.

చిన్నప్పటినుండి సీతారామరాజులో దైవ భక్తి, నాయకత్వ లక్షణాలు, దాన గుణం అధికంగా ఉండేవి. నిత్యం దైవ పూజ చేసేవాడు. తుని సమీపంలో పెదతల్లి ఉన్న గోపాలపట్టణంలో సీతమ్మ కొండపై రామలింగేశ్వరాలయంలో కొంతకాలం తపస్సు చేశాడు.

1916 ఏప్రిల్ 26 న ఉత్తరభారతదేశ యాత్రకు బయలుదేరాడు. బెంగాలులో సురేంద్రనాథ బెనర్జీ వద్ద అతిథిగా కొన్నాళ్ళు ఉన్నాడు. తరువాత లక్నోలో జరిగిన కాంగ్రెసు మహాసభకు హాజరయ్యాడు. కాశీలో కొంతకాలం ఉండి సంస్కృతభాషను అధ్యయనం చేశాడు. ఈ యాత్రలో ఇంకా బరోడా, ఉజ్జయిని, అమృత్‌సర్, హరిద్వార్, బదరీనాథ్, బ్రహ్మకపాలం మొదలైన ప్రదేశాలు చూసాడు. బ్రహ్మకపాలంలో సన్యాసదీక్ష స్వీకరించి, యోగిగా తిరిగివచ్చాడు. ఈ యాత్రలో అనేక భాషలు, విద్యలు కూడా అభ్యసించాడు. గృహవైద్య గ్రంథము, అశ్వశాస్త్రము, గజశాస్త్రము, మంత్రపుష్పమాల, రసాయన ప్రక్రియలు వంటి విషయాల గ్రంథాలను స్వయంగా వ్రాసుకొని భద్రపరచుకొన్నాడు.

అనేక యుద్ధవిద్యల్లోను, ఆయుర్వేద వైద్యవిద్యలోను ప్రావీణ్యుడవటంచేత త్వరలోనే రాజు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఆరాధ్యుడయ్యాడు. మన్యం ప్రజల కష్టాలను నివారించడానికి ప్రయత్నించేవాడు. ముహూర్తాలు పెట్టడం, రక్షరేకులు కట్టడం, మూలికా వైద్యం, చిట్కా వైద్యం, రామాయణ భారత భాగవత కథలు వినిపించడం చేసేవాడు. భక్తి చూపేవారు. 1918 ప్రాంతంలో కొంగసింగిలో ఒక మోదుగ చెట్టు క్రింద మండల దీక్ష నిర్వహించాడు. ఇతనికి అతీంద్రియ శక్తులున్నాయని ప్రజలు భావించేవారు.

బ్రిటిష్ ప్రభుత్వం మన్యం ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేసింది.

ఆ రోజుల్లో ఏజన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్లదొరల చేతిలో అనేక దురాగతాలకు, దోపిడీలకు, అన్యాయాలకు గురయ్యేవారు. శ్రమదోపిడి, ఆస్తుల దోపిడి, స్త్రీల మానహరణం సర్వసాధారణంగా జరుగుతూ ఉండేవి. మన్యంలో గిరిజనుల జీవితం దుర్భరంగా ఉండేది. పోడు వ్యవసాయం చేసుకుంటూ, అటవీ ఉత్పత్తులను సేకరించి వాటిని అమ్ముకుని జీవించే వారిపై బ్రిటీషువారు ఘోరమైన దురాగతాలు చేసేవారు. రక్షిత అటవీప్రాంతం పేరుతో పోడు కొరకు చెట్లను కొట్టడాన్ని నిషేధించింది ప్రభుత్వం. గిరిజనులకు జీవనాధారం లేకుండా చేసింది. అటవీ ఉత్పత్తుల సేకరణలో కూడా అడ్డంకులు సృష్టించింది. మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాటానికి సిద్ధ మైనాడు. చుట్టుపక్కల 30, 40 గ్రామాల ప్రజలకు రాజు నాయకుడయ్యాడు.

గంటందొర, మల్లుదొర, మొట్టడం వీరయ్యదొర, కంకిపాటి ఎండు పడాలు, సంకోజి ముక్కడు, వేగిరాజు సత్యనారాయణ రాజు (అగ్గిరాజు), గోకిరి ఎర్రేసు, బొంకుల మోదిగాడు వంటి సాహస వీరులు 150 మంది దాకా ఇతని అజమాయిషీలో తయారయ్యారట. పోలీసు స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకెళ్ళడంతో విప్లవం ప్రారంభమైంది. 1922 ఆగస్టు 19న మహారుద్రాభిషేకం చేసి చింతపల్లి పోలీసు దోపిడీకి నిశ్చయించుకొన్నారు. ఆగష్టు 22న మన్యం విప్లవం ఆరంభమైంది.

చింతపల్లి, కృష్ణదేవు పేట, రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం, తదితర పోలీస్ స్టేషన్ లను ముట్టడించి ఆయుధాలను తీసుకెళ్లారు.

ప్రభుత్వం ప్రజలను పెడుతున్న కష్టాలను చూడలేని రాజు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డారు.

1924 మే 7న కొయ్యూరు గ్రామ సమీపంలో ఒక ఏటి వద్ద కూర్చొని, ఒక పశువుల కాపరి ద్వారా తనున్న చోటును పోలీసులకు కబురు పంపాడట. ఏటి ఒడ్డున స్నానం చేస్తూ ఉండగా పోలీసులు చుట్టుముట్టి రాజును బంధించారు. కొయ్యూరులో విడిది చేసి ఉన్న మేజర్ గుడాల్ వద్ద రాజును హాజరు పరిచారు. బందీగా ఉన్న అల్లూరి సీతారామ రాజును (ఒక చెట్టుకు కట్టివేసి) ఏ విచారణ లేకుండా గుడాల్ కాల్చి చంపాడు. తల్లికి కూడా రాజు మరణ వార్తను తెలియజేయలేదు. మే 8 న రాజు దేహాన్ని ఫొటో తీయించిన తరువాత దహనం చేసారు. అతని చితా భస్మాన్ని సమీపంలో ఉన్న వరాహ నదిలో కలిపారు. ఆ విధంగా కేవలం 27 ఏళ్ళ వయసులోనే అల్లూరి సీతారామరాజు అమరవీరుడయ్యాడు.

రామరాజు చనిపోయే ముందు రూథర్ ఫర్డ్ తో సాగిన సంభాషణ ఆయన వ్యక్తిత్వానికి దర్పణం పడుతుంది...

నీలాంటి వీరుడు మా దేశంలో పుట్టి ఉంటే అని రూథర్‌ఫర్డ్ అన్న సందర్భంలో...."రూథర్‌ఫర్డ్.. పొరపాటున కూడా అలా ఊహించవద్దు. ఇది నా మాతృభూమి. ఇక్కడి మట్టి పవిత్రం, నీరు పవిత్రం, గాలి పవిత్రం. నదులు, కొండలు సమస్తం పవిత్రం. ఈ జన్మకే కాదు.. వేయి జన్మలకైనా ఈ పుణ్యభూమిలోనే పుడతాను. నా ప్రజల సముచ్ఛరణకే పాటుపడతాను".

స్వరాజ్యం ఒకరిస్తే పుచ్చుకునే బిచ్చం కాదు. పోరాడి గెలుచుకునే హక్కు. రక్తమాంసాలు దారబోసి రక్షించుకోవాల్సిన వరం. నేను కోరేది సంపన్నులు, మేధావులు అనుభవించే స్వరాజ్యం కాదు. అట్టడుగున ఉన్న మనిషి కూడా స్వేచ్ఛా వాయువులు పీల్చే స్వరాజ్యం. ఎక్కడ భయానికి చావులేదో, ఎక్కడ ప్రతి మనిషి తల ఎత్తుకొని



తిరగగలడో, ఎక్కడ ఒకరి కష్టాన్ని మరొకరు కొల్లగొట్టరో, ఏది ద్వేష అసూయలకు అతీతమైన సంఘమో అలాంటి సంఘాన్ని రామరాజ్యాన్ని నేను కోరుతున్నాను.

నీ దుష్ట రాజ్యం నా జాతిని సర్వనాశనం చేసింది. ఆ కన్నీటి ప్రవాహాల్లో కరిగిన ఈ గుండె కరడుకట్టింది. మీ పాలనపై పగబట్టింది. రేగిన ఈ అగ్ని జ్వాల చల్లారదు. మీ అధికారం అంతమయ్యేంతవరకు, ఆఖరి తలప్రాణి ఈ గడ్డ వదలి పారిపోయేంత వరకు ఈ నిప్పుటేరులే, ఈ రక్త వర్షాలే, ఈ జీవన మరణ పోరాటమే..

ఒక్క సీతారామరాజు చనిపోతే లక్షలాది సీతారామరాజులు ఉద్భవిస్తారు. ఒక్కొక్కడు ఒక్కొక్క విప్లవ వీరుడై విజృంభించి బ్రిటిష్ సామ్రాజ్యపు పునాదులు పెళ్లగిస్తారు. సీతారామరాజు ఒక వ్యక్తి కాదు.. సమూహశక్తి, సంగ్రామ భేరి, స్వాతంత్ర్య నినాదం.



–రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి




మంచిర్యాల, జులై 3:ఏఐటీయూసీ జిల్లా మహాసభలు ఆగస్టు 2న మంచిర్యాల సిపిఐ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లాలోని ఏఐటీయూసీ సభ్యులు, నాయకులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. శుక్రవారం పాత్రికేయుల సమావేశంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం దాసు మాట్లాడుతూ. భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడుల వలన కార్మిక శాఖ అధికారుల ద్వారా కార్మికులకు భారీ నష్టం జరిగినప్పుడు ఆ యజమాన్యాలకు కట్టబెట్టిన అనుమతులను రద్దుచేసి నష్టపోయిన కార్మికునికి పరిహారం చెల్లించే విధంగా పాత లేబర్ చట్టాల హక్కులను తిరిగి కల్పించాలని డిమాండ్ చేశారు. నూతనంగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడు ల వల్ల కార్మికులకు యజమాన్యాలకు అనుసంధానకర్తలుగా తప్ప జరిగిన నష్టానికి విచారణ చేసి వివరణ ఇచ్చే అధికారం కార్మిక శాఖ అధికారులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కార్మికునికి ఎనిమిది గంటల పని విధానం పోయి యజమాన్యానికి 10 నుండి 12 గంటల పని విధానం అమరుల్లోకి వచ్చే విధంగా ఉన్నాయని పూర్తిస్థాయిలో కార్మికులకు నష్టదాయకంగా ఈ చట్టాలు అమలు చేస్తున్నారని ఇలాంటి చట్టాలను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. మా సభల పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎండి అక్బర్ అలీ, నాయకులు కలిందర్ అలీ ఖాన్, మిట్టపల్లి పౌలు, దాగం మల్లేష్, లింగం రవి, మధు, హమాలి యూనియన్ అధ్యక్షులు సత్యనారాయణ,రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధిలో ఆదర్శం

## –ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జులై 3:(నేటినిజం ప్రతినిధి): సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం తురుకాష్ పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ ఎస్కే హుస్సేన్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సయ్యద్ మోదిన్ సహా పలువురు గ్రామస్థులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పార్టీలో చేరిన వారికి కండువా కప్పిన ఆ హ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో వారు తీసుకుంటున్న నిర్ణయాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి ఎన్నికల్లో ప్రజల ఆమోదంతో ఓట్ల శాతం పెరుగుతూ వస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 8 మంది ఎంపీలు, మున్సిపల్ సర్పంచి ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందన్నారు. వేములవాడ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి



హామీని నెరవేరుస్తూ ముందుకు పోతున్నామని, సంక్షేమం అభివృద్ధి విషయంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. హైదరాబాదులో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఫోర్త్ సిటీని తన భుజ స్కందాలపై వేసుకొని అభివృద్ధి చేస్తున్నారన్నారు. మూసీ సుందరీకరణ, మెట్రో విస్తరణ వంటి అనేక కార్యక్రమాలు చె పడుతున్నారన్నారు. యువత, మేధావులు, సామాజిక కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ వేదికను చేసుకొని ముందుకు పోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రూరల్ అధ్యక్షుడు కరుణాకర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, వకుళాభరణం శ్రీనివాస్, రంగు వెంకటేష్ గౌడ్లతోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఈ 5న నల్లగొండ విశ్వకర్మ భవనంలో మెగా హెల్త్ క్యాంప్

నల్గొండ, జులై 3: నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల విశ్వబ్రాహ్మణ విద్యార్థి వసతి గృహంలో ఈ నెల 5న సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (బొట్టుగూడ, నల్లగొండ) వారి సహకారంతో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు దాసోజు యాదగిరి చారి, ప్రధాన కార్యదర్శి పెందోట సోము ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్య శిబిరం ఈ 5వ తేదీన ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు కొనసాగనున్నట్లు తెలిపారు.

ఈ క్యాంప్‌లో ప్రముఖ నిపుణులైన డాక్టర్ సయ్యద్ అబ్దుల్ ముఖీత్ (ఇంటర్నల్ మెడిసిన్), డాక్టర్ చౌర వినయ్ కుమార్ (జనరల్ ఉ లాపరోస్కోపిక్ సర్జన్), డాక్టర్ సంతోష్ (క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్), డాక్టర్ ఎన్.వరుణ్ సాయి (మెడికల్ సూపరింటెండెంట్) చే వైద్య పరీక్షలు నిర్వహిం చబడతాయన్నారు. అన్ని రకాల సాధారణ వ్యాధులకు ఉచితంగా వైద్య సలహాలు, సూచనలు అందించడమే కాకుండా షుగర్, రక్త పరీక్షలు, బి.పి, ఈసిజి పరీక్షలు చేయబడ తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా గౌరవాధ్య క్షుడు శ్రీపాద కృష్ణమాచారి, ఆర్థిక కార్యదర్శి తరునోజు భీష్మాచారి, క్యాంప్ నిర్వహణ సహాయ కార్యదర్శి కటకం వెంకటాచారి, చీఫ్ అడ్వైజర్ కంచనపల్లి షణ్ముఖ చారి, కార్యవర్గ సభ్యుడు కూరెల్ల రాఘవాచారి, ఆచారి మోరా షణ్ముఖ చారి, సొల్లేటి లక్ష్మణ్ పాల్గొన్నారు.

# 50 వేల మందికి ఉపాధి

అమరావతి, జులై 3:ఏడాదికి 10 లక్షల టన్నుల సామర్థ్యంతో నిర్మితం అవుతున్న రాయలసీమ స్టీల్ ప్లాంట్ ను మరింతగా విస్తరిస్తాం. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో స్థానిక యువతీ యువకులకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని జిందాల్ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ అన్నారు. జేఎస్ డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ పనుల్ని ప్రారంభించిన అనంతరం సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నా. లాంటి విజన్ ఉన్న నాయకులు దేశంలో చాలా అరుదుగా ఉన్నారు . ఆయన వచ్చే 25 ఏళ్లలో చేయాల్సిన అభివృద్ధి గురించి ఆలోచన చేసి అమలు చేస్తారు. సీఎం చంద్రబాబు చేసిన విజన్ వల్లే ఉమ్మడి ఏపీలో సైబరాబాద్ నగరం ఐటీ హబ్ గా ఎదిగింది. దేశాభివృద్ధి గురించి నిత్యం ఆలోచించే చంద్రబాబు లాంటి నేతలతో కలిసి పనిచేయటం పారిశ్రామిక వేత్తగా నాకు గౌరవం ప్రధాని మోదీ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారు. చంద్రబాబు లాంటి సీఎంలు ఉంటే మరింత వేగంగా లక్ష్యాలను అందుకోగలం ఇవాళ రాయలసీమ స్టీల్ ప్లాంట్, ఎనర్జీ ప్లాంట్‌తో పాటు విజయనగరం జిల్లాలో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేస్తున్నాం జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ తరపున దాదాపు రూ.50 వేల కోట్ల మేర పెట్టుబడులు పెడతాం, ఈ పెట్టుబడులతో 50 వేల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఇక్కడ తయారు చేసే ఉక్కు, ఇంధనం రాష్ట్రానికి దేశానికి ఉపయోగపడుతుందని సజ్జన్ జిందాల్ ఆశాభావం వ్యక్తం చేశారు,

# ప్రజల సుఖశాంతి కోసం శ్రీవారికి ప్రత్యేక పూజలు..

## –మోత్కూరులో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే గాధరి కిశోర్ కుమార్



యాదాద్రి, జులై 3: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నాలుగో వార్షిక బ్రహ్మోత్సవాల్లో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డా. గాధరి కిశోర్ కుమార్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం పాల్గొన్నారు.

ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు డా. గాధరి కిశోర్ కుమార్‌కు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రంలో శాంతి, సుభిక్షాలు నెలకొనాలని శ్రీ వెంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో డా. గాధరి కిశోర్ కుమార్‌ను శాలువాతో సన్మానించి, జ్ఞాపిక (మెమెంటో) అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ముప్ప వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేశం, గౌరవాధ్యక్షుడు చంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేవూరి ధర్మేందర్‌రెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు తీపిరెడ్డి మేఘారెడ్డి, కె. యాకూబ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్, పట్టణ అధ్యక్షుడు జంగ శ్రీను, ఉద్యమ నాయకుడు, సినీ గేయ రచయిత అభినయ శ్రీనివాస్, కౌన్సిలర్లు కొండ శోభ?సోమల్లు, నల్ల మధు, మహిళా అధ్యక్షురాలు మల్లం అనిత, బీఆర్ఎస్ నాయకులు గిరగాని శ్రీనివాస్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి కలెక్టర్ సుడిగాలి పర్యటన

## –ఎల్లారెడ్డి మండలంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, జులై 3:కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ గురువారం సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎల్లారెడ్డి పట్టణంలోని పెద్ద చెరువు కట్టతో పాటు పలు గ్రామాల్లో పాలశీతలీకరణ కేంద్రం, అంగన్‌వాడీ సెంటర్, నర్సరీ, పీహెచ్‌సీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సొసైటీ కార్యాలయం, ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. మొదటగా హాజీపూర్ గ్రామంలో నర్సరీని సందర్శించి, మొక్కల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి గండిమాసానిపేట్‌లో ఉన్న పాలశీతలీకరణ కేంద్రానికి చేరుకొని, మిషనరీని పరిశీలించారు. పాలశీతలీకరణ కేంద్రం రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పట్టణంలోని పెద్ద చెరువుకట్టపై కొనసాగుతున్న మినీ ట్యాంక్‌బండ్



పనులను పరిశీలించారు. అక్కడి పనుల వివరాలను మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, ఏఈ వినోద్‌ను అడిగి తెలుసుకున్నారు.

అక్కడి నుంచి నేరుగా మాచాపూర్ అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకోగా, చిన్నారులు గులాబీపూలు అందించి స్వాగతం పలికారు. చిన్నారులతో మాట్లాడుతూ, పద్యం పాడిన చిన్నారిని ఎత్తుకొని అయన అభినందించారు. కేంద్రానికి సరఫరా అవుతున్న కోడిగుడ్లను కలెక్టర్ పరిశీలించారు. అక్కడి నుంచి మండలంలోని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకున్నారు. కేంద్రం ఆవరణలో చెత్తాచెదారం ఉండడం చూసి వెంటనే శుభ్రం చేయించాలని పీహెచ్‌సీ డాక్టర్ శరత్‌కుమార్‌ను ఆదేశించారు. రోగులకు అందుతున్న సేవలు, మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మత్తమాల ఉన్నత పాఠశాలకు వెళ్లారు.

# ఏపీని ఉక్కు రాష్ట్రంగా మారుస్తాం: సీఎం చంద్రబాబు

అమరావతి, జులై 3: ఆంధ్రప్రదేశ్‌ను సరికొత్త పారిశ్రామిక హబ్‌గా, ముఖ్యంగా 'స్టీల్ స్టేట్'గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కడప జిల్లాలోని జమ్మలమడుగు మండలం సున్నపురళ్లపల్లెలో రూ.16,350 కోట్లతో నిర్మించనున్న ప్రతిష్టాత్మక జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా గ్రీన్ స్టీల్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని ఆయన ప్రకటించారు. కేవలం విశాఖపట్నం మాత్రమే కాకుండా, రాయలసీమ ప్రాంతాన్ని కూడా 'ఉక్కుసీమ'గా మారుస్తామని హామీ ఇచ్చారు. గతంలో స్టీల్ ప్లాంట్ పేరుతో కొందరు ఐరన్ ఓర్‌ను దోచుకుంటూ స్మగ్లింగ్‌కు పాల్పడ్డారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాయలసీమ ప్రాంతానికి రూ.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకువచ్చామన్నారు. అంతేకాదు స్థానికంగా పరిశ్రమలు స్థాపించి ఇక్కడి యువతకే ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.